


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2020

సంపుటి : 26 **301** సంచిక : 1




# తెలుగుజాతి ఘనకీర్తి తెలుగు భాషలోనే ఉన్నది!

**భా**ష సుజల ప్రవాహం. జీవనది వలె ప్రవహిస్తూనే ఉంటుంది. మధ్యలో తెప్పల్లా కొన్ని వచ్చి ప్రవాహ ఉధృతానికి తెప్పరిల్లి పోతుంటాయి.

అనంతమైన ఈ ప్రయాణం అంతుబట్టదు. తంతు తెలియదు. పాలిచ్చే ఆవు సహితమూ పొదుగులను పాలుకోసం పిండుతుంటే– వెనుక రెండు కాళ్లతో తన్నుతూంటుంది. అంతమాత్రాన పాలను పితకకుండా ఉంటామా?

పాలు సంపూర్ణ ఆహారమనే మాటను శిరమున దాల్చకుండా ఉంటామా? నెలబిడ్డకు, ఉదయం కాఫీ, టీలు కలుపుకోవడానికీ, పెరుగు తోడు పెట్టుకోవడానికీ పాలు కావాలి. అటువంటి పాలను నేలపాలుచేస్తున్నాం.

అభిమానంతో, ఆశతో ఆర్ద్రతతో, ఆవేశంతో అభినివేశంతో మాతృభాషకున్న ప్రాధాన్యం అపారం. భావ శిల్పాన్ని వ్యక్తీకరించడంలో మాతృభాష మధురతే వేఱు.

తెలుగువాడెన్నో మాతృభాషలోనే కనిపెట్టాడు. సిద్ధాంతాలను ఆవిష్కరించాడు. భూమ్మీద కల సమస్త వస్తువుల్నీ సాపేక్షంగా చూసాడు. సాక్షీ భూతుడయ్యాడు.

పూర్వీకుల ప్రతిభే భాషను అపూర్వంగా నడిపిస్తున్నది. కానీ పూర్వీకుల్లా తెలుగుదనమును కాపాడుకోలేకపోతున్నాం. సాధికారికంగా వ్యవహరించ లేకపోతున్నాం.

గాంధీగారికి సలహాదారుగా ఉండిన భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు బ్రిటిషువారి కాలంలోని రూపాయి నాణాన్నీ, రూపాయ నోటుల్నీ గాంధీగారికి చూపిస్తూ బ్రిటిషువారు తెలుగు భాషకు (లిపి) ఎంతటి ప్రాముఖ్యతనిస్తూ, ముద్రించారో చూడండి యని చూపించారు. ఆయన బి.ఎస్. రామయ్య అనో, బి. సీతారామయ్య అనో గాకుండా భోగరాజు పట్టాభి సీతారామయ్య గానే వ్యవహరింపబడ్డారు. మధ్యప్రదేశ్ గవర్నరుగా ఉన్నప్పుడు కూడా అధికార భాషలో ఉత్తరం ఉన్నప్పటికినీ, తన సంతకాన్ని భోగరాజు పట్టాభి సీతారామయ్య అను తెలుగు అక్షరాలతో సంతకం పెట్టేవారు.

మాతృభాషలో 'అమ్మా అమ్మా' అని పిలవడం అలవాటుపడిననాడు అంతరాళం నుంచీ పలుకుతాడు.

అవధానాలు జరిగే చోటుకు వెళ్లి 'అహో ఒహో అంటాడే గాని, ఒక్కమాటను అర్థం చేసుకోడు. పద్యం మనది గద్యం మనది. అప్పయ్య దీక్షితులుగారిలా అన్నారు అంటాడు. కానీ ఒక్క శతకంలోని ఒక్క పద్యం చదవడానికైనా ప్రయత్నించం. భారతియార్ 'సుందర తెలుంగు' అంటూ ప్రశంసించారని అంటాంగానీ ఐ విల్ స్పీక్ లేటర్ అని మాటతో ముగిస్తాం.

'ఆవకాయ' మా తెలుగువారికి యిష్టం అంటూనే ఫ్రైడ్‌రైస్ తింటాం.

హరికథ మనది బుర్రకథ మనది అంటాం గానీ సినిమాకే వెడతాం. పంచెకట్టును మన తెలుగువారి దంటూనే లుంగీ కడతాం. తెలుగు భాషలో మాట్లాడినా తెలుగునేలను తాకినా మనసు తుళ్ళితుళ్లిపడాలి. గోదావరిలా పరవళ్లు తొక్కాలి. కృష్ణలా, కిలకిలా నవ్వే కిన్నెరసానిలా, పొంగే పెన్నలా, ఉత్తుంగ నెగసే తుంగా జలంలా ఉండేచోటే తెలుగును మనసిచ్చే వెలుగుగా, ముద్దమందారంగా, మల్లెల సౌరభంగా వరిపంటల్లా వర్ధిల్లుతూ తెలుగువారి సంస్కృతీ సాంప్రదాయాల కోసం ఓనమాలు దిద్దుకునే ప్రయత్నం చేద్దాం.

తెలుగు జాతి వైభవాన్ని తెలుగు భాషా వైశిష్ట్యాన్ని, పలుకుల్లోని కులుకుల్లూ, ఇతిహాస ఇంపు సొంపులనూ గ్రహించడానికి దిగంతాలు తాకిన తెలుగు కీర్తిని తెలుసుకోవడానికెన్నో ఉన్నాయ్.

అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజస్వామి కృతులు, రామదాసు పాటలు, క్షేత్రయ్య పదాలు ప్రపంచమంతటా పరవశింపచేస్తున్న కూచిపూడి నృత్యం, జానపద కళలు, జానపద గేయాలు– ఇలా ఎన్నయినా చెప్పుకోగలం.

తెలుగు పౌరుషం గురించీ అపౌరుషాలైన వేద సంశోధనం గురించీ ఎన్నో చెప్పుకోవాల్సినవి ఉన్నాయ్.

తరంగాలు మనవి. గలగలా గోదారి, బిరబిరా పారే కృష్ణా తీరాల్లో ఎన్ని ఆలయాలున్నాయ్. ఎన్ని సంస్కృతులున్నాయ్.

ప్రతీ కాలానికీ క్రీస్తుపూర్వం క్రీస్తుశకమనడమే మనమెరిగినది. అంతకు పూర్వం శకముల చరిత్ర చెప్పలేరు గానీ ఆంధ్రశకముల చరిత్రలో ఐదువేల శతాబ్దములు చరిత్ర ఉన్నది. వేదాలను శోధించినవారున్నారు. శ్రవణం చేసినవారున్నారు. పఠనం చేస్తున్నవారున్నారు. వ్యాఖ్యానాలు వ్రాస్తున్నవారున్నారు. శాస్త్రజ్ఞులున్నారు, సైంటిస్టులున్నారు. వేదాంతులున్నారు. భగవత్సంభూతులున్నారు, భాగవతులున్నారు. భగవంతులున్నారు.


శిల్పంలో, చిత్రలేఖనంలో, కావ్యాల్లో ఎంతో ప్రతిభాశాలురున్నారు. వాఙ్మయం ఉంది. అన్నీ తెలుసుకునే తెలుగు అధ్యయనం తరిగిపోతున్నది.

ఈ తరగని, పాల తొరకల వంటి తెలుగును, పాల పాయసం లాంటి తెలుగు సారస్వతాన్నీ ఆస్వాదించే భవిష్యత్తరాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించడం అవసరం. ప్రపంచంలో 15 కోట్ల మంది తెలుగువారున్నారని లెఖ్ఖలు కట్టి చెబుతున్నారు. లెఖ్ఖకు మించిన తెలుగు సంఘాలున్నాయ్. ప్రతీ దేశమూ, ప్రతి సంవత్సరమూ బృహత్సమావేశాన్నీ, మహాసభను జరుపుతూంది.

అవధానాలు జరుపుతున్నారు. పుస్తక ఆవిష్కరణలు చేస్తున్నారు.

ఈ 15 కోట్ల మంది తెలుగువారిలో ఓ కోటిమంది తెలుగువారు 5 గుర్ని చొప్పున తెలుగును అభ్యసింపచేస్తే (వ్రాయనూ చదువనూ) 5 కోట్లమంది భాషా సంపన్నులౌతారు.

తెలుగువారు మూడు కోట్లున్నప్పుడే మూడు సముద్రాలు దాటి వాణిజ్యాన్ని తెలుగుదనాన్ని వికసింపచేశారు. ఇప్పుడు చేయలేరా!



*బుధజన విధేయుడు*

*– గోటేటి శ్రీరామారావు*

**(అక్టోబర్ 2015, ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# కాశ్మీరు ఎవరిది?

ప్రతి భారతీయుడు తెలుసుకోవలసిన చరిత్ర

కాశ్మీరు ఎవరిది?

ఇది, కశ్యప మహర్షి పేరుతో ఏర్పడిన ప్రదేశము. "మైరా" అనే సంస్కృత పదానికి అర్థము "సరోవరము".

ఈ మన్వంతరములోని సప్త ఋషులలో ఒక్కరు కశ్యపుడు. ఇతడు బ్రహ్మ దేవుని మనవడు. ఇతడి తండ్రి మరీచి మహర్షి. ఈ మరీచి, బ్రహ్మ దేవుని మానస పుత్రుడు. దక్ష ప్రజాపతి తన పదముగ్గురు కుమార్తెలనూ కశ్యప మునికి ఇచ్చి వివాహము చేశాడు. కశ్యప గోత్రము ఆరంభమయ్యేదే ఇక్కడి నుండే! వీరి సంతానములో, దేవతలు, దైత్యులు, దానవులు, నాగులు, మానవులు-మొదలుగా సర్వజీవులూ చేరి ఉన్నారు.


నీలమత పురాణము ప్రకారము, ఇప్పటి కాశ్మీర్ ఉన్న ప్రదేశములో 'సతీసరము' అనే అతిపెద్ద సరోవరము వుండేది. శివుడు, సతీదేవి - ఇద్దరికీ అది చాలా ఇష్టమైన సరోవరము అయినందువల్ల కశ్యపుడు ఈ సరోవరాన్ని వారికి బహు మానముగా ఇచ్చాడు. అయితే ఆ సరోవరములో 'జలోద్భవుడు' అనే రాక్షసుడు దాగిఉండి, కశ్యపుడి సంతానాన్ని వేధించేవాడు. అప్పుడు, కశ్యపుడు, తన కొడుకైన 'అనంత నాగుడి'తో కలసి, ఒక వరాహ ముఖము (ఇప్పటి బారాముల్లా) అనబడు కాలువను తవ్వి, ఆ సరోవరపు నీటిని బయటికి ప్రవహింపజేశాడు. ఈ విధముగా ప్రవహించిన నీరు పశ్చిమములోనున్న మరొక కాలువకు చేరుతుంది. దానిని కశ్యప సాగరము (ఈనాటి కాస్పియన్ సముద్రము) అని పిలుస్తారు.

ఆ తరువాత సరోవరము నుండీ బయటపడిన జలోద్భవుడిని విష్ణువు సంహ రించాడు. ఇలాగ నిండుకున్న సరోవరపు ప్రక్కన 'వేద వ్యాసంగముల కోసము' విశేషముగా ఒక పవిత్ర క్షేత్రాన్ని నిర్మించారు. దానిని "కశ్యప మైరా" అని పిలిచేవారు. అదే కాలక్రమేణా 'కశ్యమైరా' అనీ, "కశ్మీర" అనీ నామాంతరము చెందింది.

ఈ సుందర కాశ్మీరమును చూచుటకు గౌరీదేవి, గణపతితో పాటు హిమాచ్ఛాదితమైన ఒక పర్వత మార్గము ద్వారా తరచు వచ్చేది. దానిని "గౌరీ మార్గ" అని పిలిచేవారు. అదే నేటి గుల్మార్గ్.

'నీలమతి పురాణము' మరియూ దాని ఆధారముగా లిఖింపబడిన "రాజతరంగిణి". ఇవి, కాశ్మీరపు పౌరాణిక మరియూ ఐతిహాసిక దాఖలాలు.

పన్నెండవ శతాబ్దములో "కల్హణుడు" అనే పండితుడు వ్రాసిన గ్రంధాల శృంఖల, విశ్వములోని అన్ని చోట్లా అత్యంత కుతూహలముతోను, శ్రద్ధాభక్తులతోను అభ్యసించబడుతున్నాయి. భారత్ లో దీని గురించి ఎవరూ ఎక్కువగా పట్టించుకొనుట



లేదు. ఎందుకంటే, మాధ్యమాలు ప్రతిబింబించే కాశ్మీరు పూర్తిగా వేరే. కాశ్మీరు హిందువులది అంటే నమ్మే పరిస్థితి నేడు హిందువులలోనే లేదు. దురదృష్టము...!

ఇది ఎవరి కాశ్మీరము ?

ఇది శారదాదేవి యొక్క కాశ్మీరము.

నమస్తే శారదా దేవి కాశ్మీర పురవాసిని.

త్వామహం ప్రార్థయే నిత్యం విద్యాదానం చ దేహి మే ॥

ఇలాగ శారదా దేవిని స్తుతి చేసేది' కాశ్మీర పురవాసిని' అనే! కాశ్మీరపు లిపి ఏమిటో తెలుసా? అది 'శారదా లిపి' అప్పటి కాశ్మీర వేద విద్యాలయాలను ఏమని పిలిచేవారు ? ... "శారదా పీఠము".

ఇదంతా ఎందుకు? ఆనాడు పూర్తి కాశ్మీరాన్నే "శారదా దేశము" అని పిలిచేవారు. కాకపోతే, శంకరాచార్యులు కాశ్మీరానికి ఎందుకు వెళ్ళేవారు...? అక్కడి కృష్ణగంగా నది యొక్క తీరములోనున్న శారదాపీఠపు సొగసును చూసి, అదే పద్ధతిలో దానిని ప్రతిబింబించేలాగ ఇంకొక శారదా పీఠాన్ని తుంగభద్రా తీరపు శృంగేరిలో స్థాపించుటకు ప్రేరణ దొరికినది ఆ కాశ్మీర శారదాపీఠము వల్లనే! శారదాదేవి యొక్క శ్రీగంధపు మూల విగ్రహాన్ని కాశ్మీరు నుండే శృంగేరికి తరలించినారట.

కాశ్మీరానికి తమ కొందరు శిష్యులతోపాటు వెళ్ళిన కొత్తలో శంకరాచార్యులు, ఒక కాశ్మీరీ పండితుడి అతిథిగా ఉన్నారు. మొదటి దినమే శంకరాచార్యుల పాండిత్యానికి విస్మయము చెందిన ఆ పండిత దంపతులు, వారిని మరి కొంతకాలము తమ అతిథిగా ఉండి సత్కారాలను స్వీకరించమని మనవి చేసుకున్నారట. దానికి ఒప్పుకున్న శంకరాచార్యులు, ఒక నిబంధన పెట్టారు. ఏమనగా, 'నా వంట నేనే చేసుకుంటాను ' అని.

ఇది ఆ పండిత దంపతులకు కొంత అవమానకరముగా తోచినను, వారిష్ట ప్రకారమే, కావలసిన సంభారములనూ, వంటపాత్రలు, వంట చెరకులను ఇచ్చి విరమిస్తారు. అయితే వంట చేయుటకు కావలసిన అగ్నిని ఇవ్వడము మరచి పోయారు. మరొకసారి ఆ దంపతులను పిలచి ఇబ్బంది పెట్టరాదని తలచి శంకరాచార్యులు, అలాగే ఆకలితో నకనకలాడుతూనే పడుకుని నిద్రించారు.

మరునాడు ఆ పండిత దంపతులు వచ్చి నమస్కరించి మాట్లాడిస్తుండగా, వంట సామగ్రి అంతా అలాగే పడి ఉండుట గమనించి, 'ఎందుకని' విచారించగా, వారి శిష్యులు, అగ్నిలేని కారణాన శంకరాచార్యులు వంట చేసుకోలేదు–అని సమాధానమిచ్చారు.

తక్షణమే ఆ గృహిణి, అక్కడే ఉన్న నీటిని ఆ కట్టెలమీద చిలకరించగానే ఆ కట్టెలు అంటుకొని మండనారంభించాయి. ఈ ప్రహసనము వల్ల, శంకరాచార్యులకు, తాము ఇంకా చాలా నేర్చుకోవలసినది ఈ శారదా దేశములో ఉంది – అనిపించి, ఇంకొన్ని దినాలు అక్కడే నివశించారు.

వారు నిలచిన ఆ ప్రదేశము ఒక గుట్టను ఈనాటికీ శంకరాచార్య గుట్ట అనే పిలుస్తారు. ఆ పేరుతోనే అది ప్రసిద్ధమైనది. అదొక పుణ్యక్షేత్రము అనిపించుకున్నది. ఇది శ్రీనగరపు నట్ట నడుమ ప్రసిద్ధమైన 'దాల్' సరోవరము ప్రక్కనే ఉంది.

ఆనాటి శారదాపీఠము, దురదృష్టవశాత్తూ ఇప్పటి పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉంది. అక్కడికి వెళ్ళుటకు ఎవరికీ అనుమతి లేదు.

ఈ శారదాపీఠపు శిథిల చిత్రాలు ఈ మధ్యనే ఎవరో పోస్ట్ చేశారు.. ఉన్నవారు పంచుకోగలరు. ఆ శారదా పీఠము శిథిలమై, దినదినానికీ కుంగిపోవుతున్నది.

"విశిష్టాద్వైతము" అనే సిద్ధాంతము, "నాథముని" ద్వారా ప్రారంభమైనది అని ఉల్లేఖనములు ఉన్నాయి. దానిని యమునాచార్యులు విస్తరించినారు. మరియూ రామానుజాచార్యులు బ్రహ్మసూత్రపు చౌకట్టులో ప్రతిపాదించి, "శ్రీ భాష్యము" అనే మేరు గ్రంథాన్ని సృష్టించారు. ఇదే, శ్రీవైష్ణవుల మూలగ్రంథము. ఇటువంటి మహద్గ్రంథాన్ని సృష్టించుటకే రామానుజులు తమ శిష్యుడైన 'కురుత్తాళ్వార్' ఖురేషీతో కలసి బ్రహ్మసూత్రాన్ని వెదకుతూ కాశ్మీరానికి వెళ్లారు. వారికి అప్పటికే అరవై యేళ్ళు! ఇది మన కాశ్మీరు చరిత్ర!

కాశ్మీరు లోని అనేక నగరాల, ప్రదేశాల మూల నామాలు, ఇప్పటి నామాలు

కాశ్మీరు, దీని మూల నామము శారదాదేశము.

ఇక్కడ ఆచార్య శంకర భగవత్పాదులు శారదాదేవి సమక్షములో పాండిత్యాన్ని ప్రదర్శించి, తల్లి భారతి అనుగ్రహాన్ని పొందిన ప్రదేశము. ఇక్కడి మూల నివాసులు శారదా భక్తులు, మరియు సంస్కృత పండితులు.

అష్టాదశ శక్తిపీఠాల శ్లోకములో ఇలాగుంది

॥ వారణ్యస్యమ్ విశాలాక్షీ కాశ్మీరేషు సరస్వతీ ॥ అని వ్యాఖ్యానము.

నమస్తే శారదాదేవి కాశ్మీర పురవాసిని ... అని భక్తితో పాడుకుంటాము.

కాశ్మీరము కేవలము హిందువులది. తురుష్క ముష్కరుల దాడిలో లక్షల కాశ్మీర పండితులు తమ స్వస్థానాలను వదలి ప్రాణాలు నిలుపుకొనుట కోసము వలస వెళ్ళారు.



ఇప్పుడు కాశ్మీరుకు పూర్వ వైభవము, ప్రాచుర్యము, సాంస్కృతిక ప్రాధాన్యము వస్తాయనుటలో ఎటువంటి సందేహము లేదు.

దేశములో ఎవరైనా యథేచ్ఛగా కాశ్మీర్ లో వెళ్ళి నివశించవచ్చు.

ఇంకా కాశ్మీరు లోని పట్టణాల పేర్లు :

వరాహ మూల ః బారాముల్లా

జంబూదేశ ః జమ్ము

కర్ణరాజ పురం –పీర్ పంజల్

సూర్య పుర ఃసోపూర్

అవంతీ పురం – పుల్వామా

జయపురం – సంబల్.

ఒకప్పుడు కాశ్మీరులో ఐదు లక్షల కన్న ఎక్కువ మంది ఉన్న కాశ్మీర పండితులు ఈ నాడు రెండు వేల కన్నా ఎక్కువ లేరు.

కాశ్మీరు మన భారతపు శిరోభాగము. దాన్ని కాపాడుకుందాము

అక్కడ శారదా సర్వజ్ఞ పీఠము ఉంది. దానికి నాలుగు ద్వారాలు. భారత దేశపు నాలుదిశల జ్ఞానానికి అది సంకేతము. అక్కడ శారద విశ్వవిద్యాలయము ఉండింది.

శంకరాచార్యులు ఎనిమిదో శతాబ్దపు చివర అక్కడికి వెళ్ళి పండితుల వాదములో గెలిచి దక్షిణ దిక్కున ఉన్న ద్వారాన్ని తెరచి దక్షిణ భారత పేరు నిలబెట్టారు.

కాశ్మీరము శైవ సాంప్రదాయ మూలాలు కలిగినది.

ఇక్కడ వుండీ వేలాది మందికి తత్త్వ, సిద్ధాంత, ఆధ్యాత్మ, సంగీతముఃఇలాగ వేర్వేరు అంశాల– విచారాల ఆలవాలమై ఉండింది.

హిందూ, బౌద్ధ, శిక్కు ధర్మాలు ఇక్కడ ప్రాచుర్యము పొందినాయి. ఇక్కడ శిల్పకళ యొక్క భవ్యమైన పరంపర ఉండినది.

ఇక్కడి లిపి, 'శారదా లిపి'. భాష కాశ్మీరీ.

రండి, "శారదా సర్వజ్ఞ పీఠాన్ని " మరలా తెరచి పూజ చేద్దాము.

జయతిద్వయం సంకల్పానికి శారదా అనుగ్రహము తోడై శారదా దేశము మనదిగా మారిన ఈ శుభవేళ అందరికీ అభినందనల అభివందనాలు. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhapamam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# అక్టోబర్ 29న పోయారు; నవంబర్ 11న జన్మించారు తేదీలు నిజమే! నెలలూ నిజమే! సంవత్సరాలే వేరు!!

**- డా॥ గోవిందరాజుల వేంకట సుబ్బారావు పాత్ర స్వభావములు చాల విరుద్ధమ్ -**




బడిలో చదువుతున్న రోజుల్లో గయోపాఖ్యానం నాటకంలో సాత్యకిగా భీమునిగా రెండు విభిన్న తరహా పాత్రల్లో నటించారు. పెద్ద పొడుగు కాదు, అంత పొట్టీ కాదు. గయోపాఖ్యానం నాటకంలో భీముని పాత్ర ధరించడానికి కొంచెం లావు పడాల్సి వచ్చింది. కసరత్తుల చేసీ, కుస్తీలు పట్టి శరీరాన్ని పెంచుకున్నారు.

గోవిందరాజుల వేంకట సుబ్బారావుగారు శ్రోత్రియ బ్రాహ్మణుడు. కానీ నాటకాల్లో అంతటి శ్రోత్రియ పాత్రలు ధరించనూ లేదు. భీకరంగా, చాందసంగా నటించనూ లేదు.కాని మొదటి చిత్రం 'మాలపిల్ల' చిత్రంలో చాంధస స్వభావుడైన 'సుందర రామశాస్త్రి' పాత్రను గంభీరంగా నటించి, సాంఘిక సామాజిక వర్గానికి ప్రతిబంధకునిగా, ప్రతి నాయకుని పాత్రను ధరించాడే- ఏంవి ధైర్యం. ఏంవి ధైర్యం? అనుకున్నారు.

బ్రాహ్మణుడయ్యుండీ, బ్రాహ్మణ వర్గంనుంచీ ఎగతాళి పొందిన పాత్ర. మొదట్లోనే ఆవకాయ అన్నం తిన్నట్లు- అంతటి కారపుతిట్లు తినే పాత్ర. 1938-39 సంవత్సరంలో విడుదలైన ఆ చిత్రాన్ని చూడవద్దని బ్రాహ్మణులు, బ్రాహ్మణ వర్గాన్ని నిర్దేశించారు. ఆ చిత్రంలోని నటులూ, చిత్ర సాంకేతికుల్లో కొందరు బ్రాహ్మణులే! అయినా వారందరూ సంస్కార కళాదృష్టితో చిత్రంలో పాల్గొన్నారు. తెలుగు చిత్ర జగత్తులో 'మాలపిల్ల' చిత్రం వివాదాత్మక చిత్రం. సుబ్బారావు గారిది విలక్షణమైన విలనిత్వం. నూటికీ రెండు వందల మార్కులు గెల్చుకుని, చాన్నాళ్లు తన పాత్ర జ్ఞాపకం ఉండేట్టు చేసుకున్న పాత్ర ఇదేనేమో!

ఇలానే జెమినీ వారి 'బాలనాగమ్మ' చిత్రంలో జంగమదేవరగా వచ్చే మాంత్రీకుని పాత్ర. "ఏంవే బాలా" అని బాలనాగమ్మను అరిచేటప్పుడు చూచి మేమంతా భయపడిపోయాం. జెమినీ వాసన్‌గారి కళ్లకు గోవిందరాజుల సుబ్బారావు గారెలా ఆనారో! అటు ఆరడుగలు అందాల రాశియైన కాంచనమాల- తెనాలి వాసే- సుబ్బారావుగారూ తెనాలివాడే! నాయకి- ప్రతినాయకులు తెనాలివాళ్లు. ఒకరు పొట్టీ! మరొకరు పొడగరీ! అయినా ఆయన, ఆమెను హడల్కొటించేసాడు. గాంధ్ల సంగు పాత్రధారిణి 'పుష్పవల్లి'తో గారాబుగాను నటించాడు.

వీటితో చెప్పుకోదగినది విజయావారి 'షావుకారు' రంగయ్య పాత్ర. 'కన్యాశుల్కం' చిత్రంలోని లుబ్ధావధానులు పాత్ర - అక్కినేనిగారు నటించిన జానపద చిత్రాల్లోని రాజుల పాత్ర - ఏ పాత్ర నైసర్గికానికి ఆ పాత్రకు పొత్తు గూర్చిన నటుడు, హత్తుకుని పోయిన నటుడు గోవిందరాజుల సుబ్బారావుయనే చెప్పాలి. 'పల్నాటి యుద్ధం'లో బ్రహ్మనాయుడు 'మాయాలోకం'లో మహారాజు, భరణీవారి తొలిచిత్రం రత్నమాలలో మహారాజు, 'ధర్మాంగద' చిత్రంలో మహారాజు, 'రాజేశ్వరి' చిత్రంలో మహారాజు, ఇలా ఎన్ని చిత్రాల్లో మహారాజుగానూ, నాయకిల తండ్రిగా నటించారనేది లెఖ్ఖలకు మించిన విషయం. కానీ లెఖ్ఖించదగిన క్యారెక్టర్ ఆర్టిస్టు.



బాలనాగమ్మలో

సుబ్బారావుగారి ప్రతీ పాత్రకు మీసమే పెద్ద ఎస్సెట్. కానీ తొలిచిత్రం 'మాలపిల్ల'లోని సుందరరామశాస్త్రి పాత్రకు మీసం తీసేయవలసి ఉన్నది. గూడవల్లి రామబ్రహ్మంగారు మీసం తీసేయమన్నారు. పాత్రనైనా వదులుకుంటాను గానీ, మీసం తీయనని ఖరారుగా చెప్పారు. కానీ గోవిందరాజుల వేంకటసుబ్బారావుగారి నాటకాల పాత్ర పోషణ తీరును విన్న రామబ్రహ్మంగారు ఆ పాత్ర నెలాగైనా సుబ్బారావుగారి చేతనే నటింపచేయాలని నిర్ణయించుకున్నారు. టాకీలు వచ్చిన కొత్త రోజుల్లో నాటకాల్లో నటించే నటీనటులను మాత్రమే సినిమా పాత్రలకు ఎన్నుకునేవారు. రంగస్థల నటులకు కూడా సినిమాల్లో నటించాలనే ఆసక్తి ఉండేది. మాటా పాటా పద్యం పాడే  నటుల్నే ఎక్కువగా తీసుకునేవారు.

చిత్రం కథ బహు ప్రాధాన్యం ఉన్న పాత్ర, నాయకుని పాత్రకన్నా ప్రధాన పాత్ర. రామబ్రహ్మంగారికీ సుబ్బారావుగారికి ఉన్న బేదాభిప్రాయం మీసమే!  పెద్ద వివాదమైంది. మీసం, తలమీద జుట్టు వద్ద వచ్చిన వివాదాన్ని పరిష్కరించుకోవాలనీ, ఆ నటుని చేతనే ఆ పాత్ర ధరింప చేయాలన్న విషయం సుబ్బారావుగారి తల్లి వద్దకు వెళ్లింది. అది ఆ రోజుల్లో అపరాధం. అయినా తల్లి అనుమతిని పొంది, మీస శిరోజాలు తీయాలి, తీసారు. అటు తరువాతి చిత్రాలకు సుబ్బారావుగారు మినహాయింపు యివ్వలేదు. ఆయన చివరి చిత్రమైన బీఎన్‌రెడ్డి గారి దర్శకత్వ చిత్రం 'భాగ్యరేఖ' వరకూ ఆ నియమాన్ని తప్పలేదు.

ఆయన కొన్ని పాత్రలకు అచ్చుగుద్దినట్టు సరిపోయేవారు. ఆయన సంభాషణలు చెప్పే తీరే వేరుగా ఉండేది. ఆయనకు జ్ఞాపకశక్తి కూడా హెచ్చుగా ఉండేది. సినిమాకు 'కంటిన్యుటీ' ప్రధానం. ఏ సంభాషణమెలా చెప్పారు? ఏ దుస్తులు ధరించారు? తన ముందు డైలాగు ధోరణి యెలా ఉండేది అన్నవి ఆయనకు జ్ఞాపకముండేది.

ఫలానా పాత్రను ఆయనచేతనే నటింప చేయాలని తలంచేవారు. అలా తలంచే ఓ పెద్ద చిత్ర నిర్మాణ సంస్థ విజయావారి చిత్రంలో *(తరువాయి 9వ పేజీలో)*

# పద్య సౌరభాలు

**పూ**ర్వం రాజులందరూ, కవులూ, కవి, గాయక, కళాపోషకులు. కృష్ణదేవరాయలు వలె సాహితీ సమరవేత్తలు.

వారు కవిత్వం వ్రాయడమే గాకుండా కవులను పోషించేవారు. భారత భారతి వేల సంవత్సరాలుగా తరగని సిరిగా ఉందంటే సాహితీ పోషణమనే చెప్పాలి. ఈ క్రింద పద్య సౌరభాన్ని చూడండి.

పద్యపాదంలోని ప్రతీ మొదటి అక్షరాన్నీ తీసుకుని గ్రహిస్తే 'రాజ దీని వివాహం చేయవయ్యా' అను వాక్యం వస్తుంది.

తనతో తీసుకుని వచ్చిన తన కుమార్తెకు వివాహం చేయించు ప్రభూ! అన్న అర్థిత్వం కనిపిస్తుంది. సార్వభౌముడు కవియే కావున అర్థం చేసుకుంటాడు. కాని వాడయితే 'పోరా' అంటాడు. విక్రమాదిత్యుని వద్దకు బ్రాహ్మణుడు తన కుమార్తెను తీసుకువచ్చి ఇలా స్తుతించాడు.

**రా**జ్యంబు దలక రసికత్వమెడలక
　　**జ**యశీలముడుగక నయము చెడక
**దీ**నుల జంపక దేశంబు నొంపక
　　**ని**జముజ్జగింపక నేర్పుగలిగి
**వి**ప్రుల జుట్టాల నెన్నుసొచ్చియట్టి
　　**వా**రిని గొల్చినవారి ప్రజల
**హ**ర్షంబుతోగారి యన్యాయ ముడుపుచు
　　**ము**న్ను జెప్పిన రదీతి జెన్ను మీరి
**చే**తలొండు లేక పాత్రల విడువక
**య**శము కలిమి తమకు వశముగాక
**వ**సుధ యేలు రాజవర్గంబులోనన
**య్యా**ది విష్ణుమూర్తి వంద్రు నిన్ను

(సిం.ద్వా7-75)

-పై సీస పద్యంలోని ప్రతిపాదంలోని మొదటి అక్షరాలను కలిపి చదివిన 'రాజ దీని వివాహము చేయవయ్యా' అనే వాక్యం ఉంటుంది.

తెలుగు కవిత్వంలో సంఖ్యా శబ్ద చమత్కారానికి ఈ కింది పద్యాన్ని ఉదాహరణంగా చెప్పుకోవచ్చు

**కరిముఖ దశ్వినుల్ శ్రుతుల కంజ సముద్భవు మోము లంబికే**
**శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రములాది మునీంద్ర మండలం**
**బురగవతుల్ గ్రహంబుల్ పయోరుహనాథుడు తారకంబులున్**
**బొరిబొరినెల్ల సంపదల్ పోలను గుండనికిచ్చు గావుతన్**

కరిముఖుడైన ఏకదంతుడు, అశ్వినులు ఇద్దరు, వేదాలు మూడు, బ్రహ్మతలలు నాలుగు, శివుని వదనాలు ఐదు, అతని కుమారుని ముఖాలు ఆరు, ఆది మునులు ఏడు, దిక్పాలకులు ఎనమండుగురు, గ్రహాలు తొమ్మిది, దశావతారాల పది, ఎత్తిన విష్ణువు అనంతమైన తారకలు, తన కృతిపతిని కాపాడుతూ ఉండాలని కవి అన్నాడు. దీనిని రచించినది మంచెన కవి. కేయూరబాహు చరిత్ర రాసిన నందూరి గుండయ మంత్రికి అంకితమిచ్చాడు. ●

---

***(8వ పేజీ తరువాయి)*** ఆయన కోసం అనుకున్న పాత్ర చేజారి పోయింది. అది ఆయన తప్పు కాదు. 'పాలేరు' చిత్రం చేయించిన తప్పు. 'పాలేరు' కోసం గుండు కొట్టించిన తప్పు. డా॥ గోవిందరాజుల వేంకట సుబ్బారావు వేయవలసిన వేషాన్ని డా॥ శివరామకృష్ణయ్య వేసారు. ఆ చిత్రం 'పెళ్లిచేసి చూడు'. 'పాలేరు'లో గుండు కొట్టిన పాత్ర గుండుకొట్టించింది.

ఇంతవరకూ వ్రాసిన వ్యాసంలో ఆయన డాక్టర్ అని పేరు ముందు వ్రాయలేదు. సినిమా టైటిల్ కార్డులో ఆయన పేరు ముందు డాక్టర్ అని వేసేవారు.

తెనాలిలో ఆయన పేరుపొందిన హోమియో డాక్టర్. అటు హోమియో మందులపై విపరీత పరీక్షలు చేస్తూ, పెద్ద పెద్ద పరిశోధకులకు ఉత్తరాలు వ్రాసే నిపుణుడైన డాక్టర్. ఇనార్గానిక్ రెవల్యూషన్ అనే ఆంగ్ల గ్రంథాన్ని కూడా వ్రాసారు.

చదువుకునే రోజుల్లో గురుసామయ్య అనే తెలుగు మేష్టారు, నాటకాల్లో వేషం వేయించేవారు. అలా తొలి నాటకంలో వేషం వేయడం తక్క స్కూలు ఫైనల్ (ఎస్ఎస్ఎల్‌సి) పరీక్షలు వ్రాసేవరకూ నాటకాల్లో వేషాలు వేయనేలేదు. మరల స్కూలులోనే మేకప్ వేసుకుని, 'గయోపాఖ్యానం' నాటకంలో రెండు విభిన్న పాత్రలు ధరించారు. అప్పటి నాటకాల్లో సంగీతం ప్రధానంగా ఉండేది. అందుకోసం 20 రాగాలను నేర్చుకున్నారు.



'షావుకారు'లో

ఏ రాగాన్నైనా అవలీలగా పాడేవారు. ఏ సంభాషణనైనా ప్రత్యేక శైలిలో చెప్పేవారు. నేలమీద కూర్చున్నవారి నుంచీ కుర్చీలపై కూర్చున్నవారు సహితమూ 'వన్స్‌మోర్' అనేవారు. పాటలు, పద్యాలకు వన్స్‌మోర్ చెప్పడం సహజం. కానీ సంభాషణలకు 'సెహబ్బాష్ వన్స్‌మోర్' అని చెప్పడం ఆ రోజుల్లో లేవు. ఆయన్ను బాగా వెన్నుతట్టి, బాగా ప్రోత్సహించిన సమాజం తెనాలి రామవిలాస్ సభ. రంగస్థలంపై ద్విపాత్రాపోషణం చేసినవారు డా॥ గోవిందరాజుల వేంకటసుబ్బారావే.

'బొబ్బిలి' నాటకంలో హైదర్‌జంగ్, బుస్సీ పాత్రలను అద్భుతంగా పోషించేవారు.

"ప్రతాపరుద్రీయం'లోని ఆయన తన నటనా ప్రతాపాన్ని చూపారు. మద్రాసులో ఆ నాటకరచయిత 'వేదం వేంకటరాయశాస్త్రి' గారి సమక్షంలో ప్రదర్శించినపుడు ఆయన ప్రశంసలను ఘనంగా పొందారు.

ఓ ప్రక్క డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూనే నాటకాల్లో నటించారు. చెన్నయ్‌లో ఆయన సినిమా నటునిగా స్థిరపడిన తరువాత కూడా ఆయన డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూనే వచ్చారు. 1895 సం॥ము నవంబర్ 11న తెనాలిలో జన్మించిన గోవిందరాజుల వెంకట సుబ్బారావు గారు 1959 సం॥ అక్టోబర్ 29న 64 సం॥లాకే కాలం చెందారు. ఆయన నటనా శైలిని పుణికిపుచ్చుకున్న వారు లేనే లేరని చెప్పాలి; ఆయన నట వారసులూ లేరు. ●

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

b-d

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**



# అద్భుత సంగీత స్రష్ట

# ఆర్.డి.బర్మన్

సంగీతానికి రాళ్ళు సైతం కరుగుతాయంటారు.

కాని ఆయన ఆ రాతిలోంచి కూడా సంగీతం పుట్టించే దిట్ట.

సంగీతానికి అన్ని జీవులూ తలలూపుతాయి అంటారు...

కానీ ఆయన మనం సంగీతం వింటూ తలలూపుతున్నప్పుడు, ఆ గాలి సవ్వడిని కూడా తన సంగీతంలో వాడేసుకునే నిపుణుడు. ఆయనే – ఆర్.డి.బర్మన్.

ఏ వస్తువులోంచి అయినా సంగీతాన్ని పుట్టించగల సంగీత స్రష్ట, ప్రసిద్ధి చెందిన ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు రాహుల్ దేవ్ బర్మన్, ప్రముఖ సంగీత దర్శకుడు సచిన్ దేవ్ బర్మన్, గేయ రచయిత్రి మీరా దేవ బర్మన్ దంపతులకు జూన్ 1939 కోల్‌కతాలో జన్మించారు.

ఆయనకు 'పంచందా' అనే ముద్దుపేరు ఉండేది. దీనికి కారణంగా ఒక కథ కూడా ప్రచారంలో ఉండేది. అదేమిటంటే బర్మన్ బాల్యంలో ఏడిస్తే పంచమ స్వరం స్థాయిలో వినపడేది కాబట్టి ఆ పేరుతో పిలిచేవారని అనుకునేవారు.

కలకత్తాలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. కానీ తండ్రి ఎస్.డి.బర్మన్ అప్పటికే బాలీవుడ్ లో బిజీగా ఉండటంతో ముంబైకి మారిపోయారు. ముంబైలో సితార్‌ను ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్ దగ్గర, తబలను సమత ప్రసాద్ వద్ద శిక్షణ పొందారు. సలిల్ చౌధురిని గురువుగా స్వీకరించారు. తన 9వ ఏటే "ఆయే మేరీ తోపీ" అనే పాటను స్వరపరిచారు. ఈ పాటను ఎస్.డి.బర్మన్ ఫంటూష్ అనే సినిమాలో వాడుకున్నారు. గురుదత్ తీసిన ప్యాసా సినిమాలోని "సర్ జో తేరా చక్రయే" పాటను కూడా బాల్యంలో ఆర్.డి.బర్మన్ స్వరపరచినదే.

తండ్రి దగ్గర పలు సినిమాలకు అసిస్టెంటుగా పనిచేసి, తరువాత తన స్వంతంగా సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. తండ్రి దగ్గర అసిస్టెంట్ గా పనిచేసిన చల్తీ కా నాం గాడీ (1965), కాగజ్ కా ఫూల్ (1959), తేరే ఘర్ కే సామ్నే (1963), బాందినీ (1963), జిద్దీ (1964), గైడ్ (1965), తీన్ దేవిన్ (1965) సినిమాలతో బాగా ప్రసిద్ధి చెందారు. 1960వ దశకం నుంచి 1990వ దశకం వరకు 331 చిత్రాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించారు.

## సినీ సంగీత ప్రస్థానం

తన స్వంత సంగీత దర్శకత్వంలో విడుదలైన మొదటి సినిమా "ఛోటే నవాబ్(1960)". నిజానికి ఈ సినిమా దర్శకుడు మొహమద్ (ప్రముఖ బాలీవుడ్ హాస్య నటుడు) మొదట ఎస్.డి.బర్మన్ ను సంప్రదించగా, డేట్స్ ఖాళీ లేక ఈ అవకాశాన్ని తన కొడుకుకు ఇచ్చాడు. ఆ తర్వాత మొహమద్, ఆర్.డి.బర్మన్ మంచి స్నేహితులుగా మారారు. మొహమద్ తీసిన భూత్ బంగ్లా (1965) లో సంగీత దర్శకత్వంతో పాటు, బర్మన్ గెస్ట్ ఎపియరెన్స్ ఇచ్చాడు.

బర్మన్ సంగీత దర్శకత్వంలో విజయవంతమైన మొదటి చిత్రం "తీస్రీ మంజిల్" (1966). ఈ సినిమాలో అవకాశం కోసం నిర్మాత, రచయిత "నాసిర్ హుస్సేన్" దగ్గర బర్మన్ సంగీత విభావరి ఏర్పాటు చేశాడట! గేయ రచయిత మజ్రూహ్ సుల్తాన్ పురీ. అందుకే ఈ సినిమా పాటలు విజయవంతం కావడానికి మూల కారణం సుల్తాన్ పురీ అనేవారట బర్మన్. ఈ సినిమాలోని ఆరు పాటలనూ సుల్తాన్ పురీ రాయగా మహ్మద్ రఫీ పాడారు. వాటిలో మూడు పాటలు యుగళ గీతాలు కాగా వాటిని రఫీతో పాటు ఆశా భోస్లే పాడారు. తరువాతి రోజుల్లో బర్మన్ ఆమెనే పెళ్ళి చేసుకున్నారు. ఈ చిత్రం సంగీత పరంగా ఘన విజయం సాధించడంతో బర్మన్ ను, గేయ రచయితగా సుల్తాన్ పురీని మిగతా ఆరు సినిమాలకు కూడా బుక్ చేసుకున్నాడట నాసిర్ హుస్సేన్. ఆ ఆరు సినిమాలలో సంగీత పరంగానూ, కమర్షియల్ గానూ ఘన విజయం సాధించిన బహారోన్ కె సప్నా (1967), ప్యార్ కి మౌసం (1969), యాదోంకీ బారాత్ (1973), పడోసన్ (1968) కూడా ఉన్నాయి. తన స్వంత సంగీత దర్శకత్వంలో సినిమాలు చేస్తూనే జ్యుయెల్ థీఫ్ (1967), ప్రేం పూజారీ (1970) సినిమాలకు తన తండ్రి వద్ద సహాయ సంగీత దర్శకునిగా పనిచేశారు. తండ్రి ఎస్.డి.బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన ఆరధన (1969) సినిమాలో కిషోర్ కుమార్ పాడిన "మేరే సప్ నోం కీ రాణీ కబ్ ఆయేగీ తూ", "కోరా కాగజ్ థా యే మన్ మేరా" పాటలు ఆర్.డి.బర్మన్ కంపోజ్ చేసినవేనని పుకారు ఉండేది. ఆ సినిమాకు ఆర్.డి.బర్మన్ సహాయ సంగీత దర్శకునిగా వ్యవహరించారు.

1981లో వచ్చిన సనమ్ తేరే కసమ్ సినిమాకుగానూ ఉత్తమ సంగీత దర్శకుడిగా తొలి ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. కిషోర్‌కుమార్ పాడిన 'రూప్ తేరా మస్తానా' పాట సంగీత అభిమానుల్ని ఓ ఊపు ఊపింది. ఈ సినిమాతో రాజేశ్ ఖన్నా, కిషోర్ కుమార్, బర్మన్ మంచి స్నేహితులుగా మారారు. తర్వాత మూడేళ్లకు వీరు ముగ్గురు కలిసి పనిచేసిన 'కటి పతంగ్' సినిమా రిలీజై సూపర్ హిట్ అయింది. రాజేశ్ ఖన్నా నటించిన 34 సినిమాలకు ఆర్.డి.బర్మన్ సంగీతం సమకూర్చారు.

1986లో బర్మన్ స్వరపరచిన "ఇజ్జత్" సినిమాలోని పాటలు అతని కెరీర్ లో చాలా మంచి హిట్. కానీ ఈ సినిమా ఆర్ట్ ఫిలిం కావడంతో కమర్షియల్ గా అతని కెరీర్ కి పెద్ద ప్రయోజనం కలగలేదు. అందుకే అతని కెరీర్ తిరోగమనాన్ని ఆపలేకపోయాడు. ఈ సినిమాలోని నాలుగు పాటల్నీ ఆశా పాడగా, గేయ రచయిత గుల్జార్ రాశారు. ఈ పాటలతో బర్మన్ విమర్శకుల ప్రశంసలు లభించాయి. ఈ సినిమాలోని పాటలకు గానూ ఆశాకు ఉత్తమ నేపథ్యగాయనిగా, గుల్జార్ కు ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డు వచ్చింది, కానీ బర్మన్ కు మాత్రం ఏ అవార్డూ లభించలేదు.

కెరీర్ మొత్తం మీద 331సినిమాలకు స్వరాలు అందించారు రాహుల్ దేవ్. వాటిలో 292 హిందీ, 31 బెంగాలీ, 3 తెలుగు, 2 తమిళ, ఒరియా, 1 మరాఠీ సినిమాలు ఉన్నాయి. హిందీ, మరాఠీ భాషల్లో 5 టీవీ ధారావాహికలకు సంగీతం అందించారు.

## వినూత్నమైన ప్రయోగాలు

ఆర్.డి.బర్మన్ హిందీ సినీ సంగీత ప్రపంచంలో కొత్త ఒరవడి సృష్టించిన స్వరకర్త. ఒక మూస లాంటి సంగీతంతో విసిగిపోయిన సినీ ప్రేక్షకుల్ని కొత్త రకపు పాటల్తో ఆకట్టుకున్నాడు. తన సంగీతంలో ఎలక్ట్రానిక్ రాక్, డిస్కో వంటి కొత్త రీతులను చొప్పించి తాజా సంగీతాన్ని ప్రజలకు అందించారు. రాజేష్ ఖన్నా సినిమాలలో కొత్త రకపు ప్రేమకథలకు విభిన్నమైన సంగీతాన్ని అందించి తనదంటూ ఒక ముద్రను బాలీవుడ్ సంగీతంలో వేశారు. బెంగాలీ జానపద సంగీతాన్ని సినీ సంగీతానికి దగ్గర చేశారు.

పాశ్చాత్యం, అరబిక్ సంగీత రీతుల ప్రభావం తనపై ఉన్న ఆర్.డి.బర్మన్ ఆ సంగీతాలలోని అంశాలను తన శైలిలోకి మార్చుకున్నారు. వెదురు బొంగులతోను, గరుకు కాగితాలతోనూ సంగీతాన్ని సృష్టిస్తూ ఎన్నో ప్రయోగాలు చేశారు. మెహబూబాను స్వరపరచడానికి బీర్ సీసాలతో సంగీత సృష్టించారు. యాదోంకీ బారాత్ (1973) లోని "చురాలియ హై తుమ్" అనే పాటలో కొంత భాగం కప్పులు, సాసర్లను ఉపయోగించి స్వరపరిచారు. సత్తే పే సత్తే (1982) నేపథ్య

సంగీతంలో గలగల పారే నీటి శబ్దాలు రావడం కోసం గాయని అన్నెట్టె పింటో గొంతు సవరించుకున్న శబ్దాలను రికార్డ్ చేసి ఉపయోగించారు. పడోసన్ (1968) లోని "మేరే సామ్నే వాలీ ఖిడికీ మే" పాటలో వింత శబ్దాలు రావడం కోసం దువ్వెనను గరుకు నేలపై గీసిన శబ్దాలను వాడారట. ఇలా ఎన్నో ప్రయోగాలతో శ్రోతలను పాట విన్నంతసేపూ గిలిగింతలు పెడుతుంటారు.

మెహబూబా పాటకు బీరు బాటిల్స్ లోకి గాలి ఊది, దుమ్మురేపే సంగీతం సృష్టించారు. డార్లింగ్ డార్లింగ్ అనే సినిమాలో 'రాత్ గయీ బాత్ గయీ' అనే పాట కోసం తన అసిస్టెంట్ మారుతీరావు వీపుపై తాళమేసారు. మనం శ్వాస తీసుకునే, ఎగబీల్చే, నవ్వే విధానాల్ని కూడా ఆయన తన పాటల్లో వాడుకునేవారు. ఉదాహరణకు 'దునియా మే లోగోంకో...' అన్న పాటలో శ్వాసను, 'ఏ నైనా యాద్ హై' అన్న పాటలో ఆశా భోంస్లే నవ్వును, 'హోగా తుంసే ప్యారా కౌన్' పాటకోసం సాండ్ పేపర్, వెదురు బొంగుల ధ్వనిని లయగా వాడారు.

తొలిసారిగా సంతూర్, గిటార్ వాయిద్యాల కాంబినేషన్ తో 'రైనా బీతీ జాయే' అన్న పాటను, 'చింగారి కోయీ భడ్ కే' అన్న పాటలను అమర్ ప్రేమ్(1971) చిత్రంకోసం వాడిన తొలి సంగీత దర్శకులు పంచందా నే.

మౌసమ్ చిత్రం (1983) కోసం 12 తంత్రుల సెమి ఎలక్ట్రిక్ గిటార్ వాడి, 'తుజ్ సె నారాజ్ నహీ జిందగీ' అన్న అద్భుతమైన పాటను సృష్టించారు.

'తేరే బినా జియా జాయెనా', 'ఓ మాంఝీ' అనే పాటలకు తబలానే లయగా వాడి, మాధుర్యం సృష్టించారు.

కొన్ని ప్రత్యేక సందర్భాలలో తన సినిమాలోని కొన్ని పాటలను వేరొక గాయకునితో వేర్వేరు సినిమాలలో పాడించారు బర్మన్. ఖుద్రత్ (1981) సినిమాలోని "హమే తుమ్ సే ప్యార్ కిత్నా" పాటను కిశోర్ కుమార్ పాడగా, దాని మరొక వెర్షన్ ను పర్వీన్ సుల్తానాతో పాడించారు. ప్యార్ కే మౌసమ్ (1969) సినిమాలోని "తుమ్ బినా జవూ కహా" పాటని కిశోర్ కుమార్ తోనూ, మహ్మద్ రఫీతోనూ పాడించి ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు బర్మన్.

తండ్రి సంగీత దర్శకత్వం వహించిన సోల్వా సాల్ (1958) సినిమాలో "హై అప్నా దిల్ తో అవారా" పాటలో ఆర్.డి.బర్మన్ వాయించిన మౌత్ ఆర్గాన్ ట్రాక్ నేటికీ ఎంతో ప్రసిద్ధమైనది.

కొన్ని ప్రసిద్ధమైన హాలీవుడ్ ఆల్బంస్ లోని పాటల ట్యూన్ లను నిర్మాతల ఒత్తిడి మేరకు వాడేవారు. రమేశ్ సిప్పి ఒత్తిడి వలన "యూ లవ్ మీ" పాటను షోలే (1975) లోని "మెహబూబా మెహబూబా" పాట కోసం కాపీ కొట్టారు. అలాగే నాసిర్ హుస్సేన్ వల్ల అబ్బా పాడిన "మామా మియా" పాటను మిల్ గయా హమ్ కో సాతీ సినిమాలో వాడారు. చబ్బీ చీకర్ పాట "లెట్స్ ట్విస్ట్"ను భూత్ బంగ్లా సినిమాలో "ఆవో ట్విస్ట్ కర్నే" పాటగా మార్చేశారు. లియో సేయర్ పాట "వెన్ ఐ నీడ్ యూ"ను "తుమ్ సే మిల్కే" గానూ, పాల్ అంకే పాట "ద లాంగెస్ట్ డే"ను "జిందగీ మిల్కే బితాయేంగే" గా, పెర్షియన్ కళాకారుడు జియా అతబి పాట "హెల్ మాలీ"ను "జాన్ తేరీ యే నజర్ హై", అలెగ్జాండర్ పాట "జిగెనర్ జుంగే"ను "దిల్ బర్ మేరే"గా మార్చారు బర్మన్.

భారతీయ రీమిక్స్ ఆల్బములలో చాలా వాటిలో బర్మన్ పాటలు ఎక్కువగా ఉన్నాయి. బాలీ సాగూ చేసిన బాలీవుడ్ ఫ్లాష్ బ్యాక్ ఆల్బమ్ దీనికి ఒక ఉదాహరణగా నిలిచింది. దక్షిణ ఆసియా డిజేలు రీమిక్స్ చేసిన బర్మన్ పాటలు యునైటెడ్ కింగ్ డమ్ లోనూ, ఉత్తర అమెరికాలోనూ చాలా ప్రసిద్ధి చెందాయి. క్రోంస్ క్వర్టెట్ చేసిన ఆల్బమ్ యూ హేవ్ స్టోలెన్ మై హార్ట్ (2005) లో రీమిక్స్ చేసిన ఆర్.డి.బర్మన్ పాటలు చాలేనే ఉన్నాయి. వాటిని ఆయన భార్య ఆశా పాడారు. 2012లో హిమేష్ రష్మి తీసిన ఖిలాడి 786 సినిమాలోని బల్మా పాట కూడా ఆయన నివాళిగా స్వరపరిచినదే.

## తెలుగు సినిమాలు

తెలుగులోనూ మూడు సినిమాలకు ఆయన మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేశారు. అవి రాకీ (1987), చిన్ని కృష్ణుడు (1988), అంతం (1990).

చిన్నికృష్ణుడు చిత్రం లోని మౌనమే ప్రియ పాట ప్రస్తావన తెచ్చారు, నిజంగానే జానకమ్మ పాడిన ఈ పాట కూడా చాలా బాగుంటుంది. పంచం దా (R D Burman) సంగీతం అపురూపం అజరామరం. వేటురిగారు రాసారని మళ్ళీ చెప్పాలా?

## సూపర్ హిట్ కాంబినేషన్

గీత రచయిత గుల్జార్, బర్మన్‌ల కాంబినేషన్ కూడా చాలా ప్రసిద్ధి చెందినది.

## వ్యక్తిగత జీవితం

బర్మన్ 1966లో రీటా పటేల్‌ను వివాహమాడారు. కానీ వ్యక్తిగత కారణాల వల్ల 1971లో విడాకులు తీసుకున్నారు. రీటాతో బంధం తెగిపోయాక 1980లో ఆశా భోస్లేను పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో అనేక విజయవంతమైన పాటలు వచ్చాయి. కానీ 2007లో ఆయన చనిపోవడానికి ముందే వీరిద్దరూ విడిపోయారు.

భార్య ఆశా భోస్లే, సన్నిహితుడు కిషోర్ కుమార్, లతా మంగేష్కర్‌తో కలిసి అనేక జనరంజకమైన పాటలను స్వరపరిచారు. ధమ్ మారో ధమ్, పియా తూ, ఏక్ లడకీ కో దేఖా వంటి ప్రసిద్ధ పాటలను ఆయనే స్వరపరిచారు.

1988లో బర్మన్ గుండెపోటుతో బాధపడి, ఒక సంవత్సరం తరువాత లండన్ లో ది ప్రిన్స్ గ్రేస్ ఆసుపత్రిలో బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ సమయంలోనే ఆయన చాలా పాటలను స్వరపరిచారు కానీ అవి ఎప్పటికి విడుదల కాలేదు. విదు వినోద్ చోప్రా తీసిన పరిందా (1989) సినిమాకు సంగీతం అందించారు. గ్యాంగ్ సినిమాలో "ఛోడ్ కె నా జానే" అనే పాటాను బర్మన్ స్వర పరచగా ఆశా పాడారు. కానీ ఈ సినిమా విడుదల కావడానికి ముందే బర్మన్ చనిపోయారు. ఒకే ఒక పాట స్వరపరచడంతో ఈ సినిమాలోని మిగిలిన పాటలను అను మాలిక్ స్వరపరిచారు. ప్రియదర్శన్ తెరకెక్కించిన "తెన్మవిన్ కొంబత్" అనే మలయాళం సినిమాకు చివరగా సైన్ చేశారు బర్మన్. కానీ ఆయన దానిని స్వరపరచలేదు. 1942: ఎ లవ్ స్టోరి (1994) సినిమాకు సంగీతం అందించారు బర్మన్. ఆ సినిమా ఆయన చనిపోయిన తరువాత విడుదల అయ్యి ఘన విజయం సాధించింది. ఈ సినిమాతో ఆయనకు మూడవ, ఆఖరి ఫిలింఫేర్ అవార్డ్ లభించింది.

బర్మన్ మరణం తరువాత చాలా సినిమాలలో ఆయన పాటలు ఒరిజినల్ గానూ, రీమిక్స్ లగానూ ఎన్నో వచ్చాయి. బర్మన్ శైలి, స్వరాల ప్రభావం చాలా మంది స్వరకర్తలపై ఉంది అనడానికి ఇవే నిదర్శనాలు. దిల్ విల్ ప్యార్ వ్యార్ (2002) సినిమాలో ఆయన పాటలు చాలా రీమిక్స్ చేశారు. క్వాషిష్ (2003) సినిమాలో మల్లికా శెరావత్ బర్మన్ అభిమానిగా నటించింది. 2010లో బ్రహ్మానంద సింగ్ "పంచమ్ అన్ మిక్స్ డ్: ముఝే చల్తే జానా హై" పేరుతో 113 నిమిషాల నిడిచిగల షార్ట్ ఫిలింను విడుదల చేశారు. ఈ చిన్న సినిమాని బర్మన్ నివాళిగా చిత్రీకరించారు. లూటెరా (2013) సినిమాలోని సంగీతం కూడా ఆయన గుర్తుగా స్వరపరచినవే.

1995 నుంచి ఫిలింఫేర్ అవార్డు కమిటీ బర్మన్ పేరు మీద "ఫిలింఫేర్ ఆర్.డి.బర్మన్ అవార్డ్ ఫర్ న్యూ మ్యూజిక్ టాలెంట్" అవార్డును స్థాపించి, బాలీవుడ్ లో కొత్తగా వచ్చిన ఉత్తమ స్వరకర్తలకు ఈ అవార్డు ఇస్తోంది. 2009లో బ్రిహన్ ముంబయి పురపాలక సంస్థ ఒక చౌక్ కు ఆర్.డి.బర్మన్ పేరు పెట్టి ఆయనను గౌరవించింది. అంతకుముందు ఆ చౌక్ కు సాంతా క్రూజ్ పేరు ఉండేది.


బాలీవుడ్ స్వరకర్తలు విశాల్ శేఖర్, మనోహరి సింగ్, సపన్ చక్రవర్తి వంటి వారు ఆయన సంగీతం నుంచి స్ఫూర్తి పొందినవారే. వారిలో మనోహరి సింగ్, సపన్ ఆయన ఆర్కెస్ట్రాలోనే పనిచేశారు. బర్మన్ హరిప్రసాద్ చౌరాసియా, శివ్ కుమార్ శర్మ, లూయిస్ బాంక్స్, భుపిందర్, కెర్సీ లార్డ్ వంటి వారి వాద్య సహకారంతో ఎంతో చక్కని స్వరాలు సమకూర్చారు.

ఇప్పటికీ బర్మన్ పాటలు ప్రజల నాలుకల మీద నర్తిస్తూ ఉంటాయి. మెలోడీని, రాక్ సంగీతాన్ని, ఎటువంటి పాటనైనా అజరామరంగా స్వరపరచిన పంచందా నిజంగా చిరస్మరణీయులు!

– భావరాజు పద్మిని


SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

తిరుమల విశేషం :



# ఆనాటి తిరుమల చిన్న గ్రామం! నేడు దివ్య మహానగరం!

**నూ**రు నూటయాభైయేళ్ల క్రితం... కొండపైన శ్రీవారి ఆలయం, హథీరాంజీ మఠం తప్ప వేరే ఏ నిర్మాణాలు ఉండేవి కావు. అర్చకులు సైతం కొండ కింద ఉన్న కొత్తూరులోనే ఉండేవారు. తెల్లవారుఝామునే లేచి సప్తగిరులూ ఎక్కి ఉదయం ఏడుగంటలకు వెళ్ళి స్వామికి మేలుకొలుపులు పాడేవారు. అడవిలోని జంతువులు, దొంగల భయంతో యాత్రికులు గుంపులు గుంపులుగా, డప్పులు వాయిస్తూ, గోవింద నామ స్మరణ చేస్తూ కొండ ఎక్కేవారు. రాళ్లూ రప్పలు నిండిన దారిలో కొంతసేపు వెళుతూ, మధ్యలో వంటావార్పు కోసం ఆగుతూ... మొత్తానికి పైకి చేరుకునేసరికి దాదాపు రెండు రోజులు పట్టేది. వారు మధ్యలో ఆగేందుకు మూడుచోట్ల దిగుడు బావులు, విశ్రాంతి మండపాలూ ఉండేవి. వాటిని ఠాణాలు అనేవారు. వయసు మళ్లినవారినీ, అంగవికలురలనూ పిల్లలనూ పైకి తీసుకువెళ్లేందుకు డోలీ కూలీలు ఉండేవారు. కావడి బద్దకు కుర్చీలు అమర్చి నడవలేనివారిని వాటిమీద కూచోబెట్టుకుని పైకి మోసుకెళ్లేవారు. అందుకు పది అణాలు రుసుము వసూలు చేసేవారు. సామాన్యులకు ఆ మాత్రం స్థోమత కూడా ఉండేది కాదు. తిరుమల రావిచెట్టు (ఇప్పుడు కళ్యాణకట్ట ఉన్న ప్రదేశం) దగ్గర డోలీలు నిలుపుకోవడానికి ఒక ప్రత్యేక మండపం ఉండేది. అక్కడి దాకానే ఈ డోలీలను అనుమతించేవారు. ఆ స్టాండును డోలీమండపం అనేవారు. (ఇప్పుడు కూడా డి.ఎం.బి. రోడ్డుగా వ్యవహరిస్తున్నారు.). అక్కణ్నుంచీ సన్నిధి వీథి మీదుగా గుడికి చేరుకుని, మహాద్వారం గుండా లోపలికి ప్రవేశించిన భక్తులు స్వామి దర్శనం చేసుకునేవారు. 1870లో యాత్రికుల సౌకర్యార్థం ప్రభుత్వం కొండమీదకు మెట్లు నిర్మించింది.



1933లో ఏర్పడిన తితిదే బోర్డు రూ. 26 వేల ఖర్చుతో ఆ మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసింది.

## ఘాట్‌రోడ్డు నిర్మాణం

1940ల నాటికి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మెల్లగా పెరగడం మొదలైంది. అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం కొండమీద రోడ్డు మార్గం గురించి ఆలోచించింది. బ్రిటిష్ అధికారులు, సర్వే బృందాలవారు, తిరుపతి చేరుకున్నారు. జనంలో ఆశ్చర్యం.అసలు అంత ఎత్తు కొండలకు రోడ్డెలా వేస్తారా అని! వారి అనుమానాలన్నీ పటాపంచలు చేస్తూ 1944 ఏప్రిల్ నాటికి అలిపిరి నుంచి తిరుమల దాకా ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేనెల పదోతేదీన మద్రాసు రాష్ట్ర గవర్నర్ ఆర్థర్‌హోప్ రోడ్డు మార్గాన్ని ప్రారంభించారు. నెమ్మదిగా దేవస్థానమే తిరుమల- తిరుపతి మధ్య రెండు బస్సులు ప్రారంభించింది. అవి తిరుపతిలోని మొదటి సత్రం నుంచి రోజుకు మూడుసార్లు ఉండేవి. తిరుమల నుంచి రాత్రి ఏడుదాటితే బస్సులే ఉండేవి కావు. 1955-56లో రైల్వేస్టేషన్ సమీపాన శ్రీనివాస బస్టాండు ఏర్పడే నాటికి భక్తుల సంఖ్య రోజుకు 500 నుంచి 600 వరకు ఉండేవి. బస్సుల సంఖ్య పెంచుకుంటూ పోవడంతో సౌకర్యంగా ఉండి భక్తులు వెల్లువెత్త సాగారు. దీంతో రెండోఘాట్ రోడ్డు గురించి ఆలోచించాల్సి వచ్చింది. 1974 నాటికి అదీ పూర్తయింది.

## కొండమీద ఊరు

తిరుమల నిర్వహణ హథీరాంజీ మఠం ఆధ్వర్యంలో ఉన్నప్పుడు యాత్రికులకు సౌకర్యాల ఏర్పరచాలంటే చాలా కష్టమయ్యేది. ఎందుకంటే అక్కడ ఎవరూ ఉండేవారు






కాదు. తిరుమలలోనే ఉందామంటే విపరీతమైన చలి. జంతువుల భయం. కొండమీద ఒక ఊరు తయారైతే, ఈ ఇబ్బందులన్నీ అధిగమించవచ్చన్న ఆలోచనతో 1910-20 కాలం నాటికి జనవాసాలను ఏర్పరచేందుకు ప్రయత్నించారు. వారికి ఆవాసం కల్పించేందుకు హథీరాంజీ మఠం భూములు లీజుకు ఇచ్చింది. నెమ్మదిగా ఆలయం చుట్టూ నాలుగు వీధులతో ఒక ఊరు ఏర్పడింది. మొదట అక్కడి జనాభా 200 నుంచి 300 మంది మాత్రమే! భక్తులకు ఈ కుటుంబాలే అన్ని సౌకర్యాలు కల్పించేవి. క్రమేణా తిరుమలలో ఉండేవారి సంఖ్య 25 వేలకు పెరిగింది. 30 ఏళ్ల క్రితం వరకూ వారంతా రోజూ సరాసరి మహాద్వారం గుండానే గుడిలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తమ పనులు చేసుకొనేవారు.

అలాగే పూజవిధానాల్లోనూ, ఆర్జితసేవా టిక్కెట్ల ధరల్లోనూ నాటికీ నేటికీ హస్తిమశకాంతరం తేడా! ఐదుపదుల ఏళ్లనాటి దేవస్థానం రికార్డుల ప్రకారం అప్పట్లో పొద్దున ఏడున్నరకు సుప్రభాత సేవ, రాత్రి పదిన్నరకు ఏకాంతసేవ జరిగేవి. క్రమేణా రాత్రి రెండున్నరకు ఆలయం మూసివేసి, సరిగ్గా అరగంటలోనే మళ్లీ సుప్రభాతంతో మేల్కొలుపులు మొదలుపెడుతున్నారు. పాపం ఏడుకొండల స్వామికి కునుకే బంగారమైంది.

**నాటి బాల్యం తిరిగి రాదన్నట్లు ఆనాటి తిరుమల గ్రామం కానరాదు!!**

వెయ్యికాళ్ళమండపం కనిపించదు. గొల్ల మండపం కనిపించదు. అక్కడ కొబ్బరి



కాయలు కొట్టే దీపారాధనా శోభ, సహస్ర దీపాల తేజంతో స్వామిని ఆరాధించి భక్తుల ప్రశాంతత పొందే అదృష్టం లేదు. వెయ్యికాళ్ల మండపం మెట్లమీద కూర్చుని ఇటు సహస్రదీపాలంకరణ సేవ, అటు శ్రీవారి వాహనసేవలు చూచే అదృష్టం కనిపించదు. నెత్తిన మూటలు, చంకని పిల్లల్నీ ఎత్తుకుని, ఏడుకొండల మెట్లు ఎక్కి వచ్చేవారి అలసట తీరే విశ్రాంత మందిరం వేయికాళ్ల మండపం లేదు! శ్రీవారి దర్శనం చేసుకుని ఎదురుగుండా ఉన్న వేయికాళ్ల మండపంలోని కిటికీ కౌంటర్లలో ప్రసాదం తీసుకునే భాగ్యాన్ని మార్చేసారు. తిరుమల యిప్పుడు మహానగరిలా భాసిల్లుతూంది.

**మరిప్పుడో**

మరిప్పుడు అదే తిరుమల ఎలా వుంది. ఎన్ని వేల వాహనాలు కొండకు వెడుతున్నాయి. మరెన్నో వేలమందిపైన కాపురముంటున్నారు. ఎన్ని లక్షల మంది రోజూ ఆ స్వామి దర్శనం చేసుకుంటున్నారు. ఇదంతా ఒక 60 ఏళ్ళ కాలంలో ఏర్పడిన మార్పు. ఇంతమంది ఒకేసారి ఆ ఏడుకొండల వాడి దయ వేడుతూ పాపం ఆయనకి కునుకు లేకుండా చేసాము. లక్షలమంది దర్శనం పైగా ఉచిత దర్శనం, సేవా దర్శనం, వి.ఐ.పి. దర్శనం. ఇంకా ఎన్నెన్ని మార్పు చూడవలసి వస్తుందో ఏడుకొండలవాడా వేంకటరమణ సంకటహరణ. ●

# విష్ణు సహస్రనామ ప్రచారం మౌలికకారణం

భీష్మపితామహుడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు అందరూ శ్రద్ధగా విన్నారు. కృష్ణుడు, ధర్మరాజుతో సహా, కాని ఎవరూ రాసుకోలేదు. మరి మనకెలా అందింది ఈ అద్భుతమైన విష్ణు సహస్రనామం?

అది 1940వ సంవత్సరం. శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా కంచి పరమచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారిని ఒక వ్యక్తి ఇంటర్‌వ్యూ చేయడానికి టేప్ రికార్డర్‌తో వచ్చాడు. ఆ టేప్ రికార్డర్ చూసి స్వామి వారు ఆ వ్యక్తిని అక్కడున్న వారినందిరినీ ఉద్దేశించి, "ప్రపంచంలో అతి పురాతన టేప్ రికార్డర్ ఏది?" అని అడిగారు.

ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు. మళ్ళీ స్వామివారు, "విష్ణు సహస్ర నామం మనకెలా వచ్చింది?" అని అడిగారు

ఒకరన్నారు, "భీష్ముడందించారన్నారు"

స్వామివారు, "భీష్ముడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు ఎవరు వ్రాసుకున్నారు?" మళ్ళీ నిశబ్దం.

స్వామివారు చెప్పడం మొదలుపెట్టారు. భీష్ముడు సహస్రనామాలతో కృష్ణుడిని స్తుతిస్తున్నప్పుడు, కృష్ణుడు, పాండవులు, వ్యాస మహర్షితో సహా అందరూ అత్యంత శ్రద్ధగా వినడం మెదలుపెట్టారు. ఎవరూ వ్రాసుకోలేదు.

అప్పుడు యుధిష్ఠురుడన్నాడు, "ఈ వేయి నామాలని మనమంతా విన్నాము కాని మనమెవరం వ్రాసుకోలేదు. ఇపుడెలా కృష్ణా" అని.

"అవును కృష్ణా ఇప్పుడెలా! ఆ సహస్రనామాలు మాకందరికీ కావాలి" అని అందరూ కృష్ణుడిని వేడుకున్నారు.

శ్రీ కృష్ణుడన్నాడు. "అది కేవలం సహదేవుడు, వ్యాసుడి వల్లనే అవుతుంది" అని చెప్పాడు.

"అదెలా" అని అందరూ అడిగారు.

శ్రీ కృష్ణుడు చెప్పాడు, "మనందరిలో సహదేవుడొక్కడే సూత స్ఫటికం వేసుకున్నాడు. ఈ స్ఫటికం మహేశ్వర స్వరూపం. దీని ప్రత్యేకతేంటంటే వాతావరణంలోని శబ్ద తరంగాలని గ్రహించి తనలో దాచుకుంటుంది. సహదేవుడు శివుడిని ధ్యానించి ప్రార్థిస్తే ఈ స్ఫటికంలోని సహస్రనామ శబ్ద తరంగాలని వెనక్కి రప్పించి (రిప్లే) వ్యాస మహర్షితో వ్రాయించమని కృష్ణుడు సలహా ఇచ్చాడు.

శ్రీ కృష్ణుడి ఆజ్ఞ మేరకు, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు వచ్చిన చోట అనగా భీష్ముడికి అతి సమీపంలో సహదేవుడు, వ్యాసమహర్షి కూర్చుని, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు రిప్లే అవుతూంటే వ్యస మహర్షి వ్రాసిపెట్టాడు.

ఆ విధంగా మనకు మొట్టమొదటి టేప్ రికార్డర్ శివస్వరూప స్ఫటికం ద్వార మనకి విష్ణు సహస్రనామం అందిందని మహాస్వామి వారు సెలవిచ్చారు.

**విష్ణుం నారాయణం కృష్ణం మాధవం మధుసూధానం ॥**
**హరిం నరహరరిం రామం గోవిందం దధివామనం ॥**

– వైద్యం వేంకటేశ్వరాచార్యులు



# పీఠాధిపతులు సాటి మనుషులు తమను ఎందుకు ముట్టుకోనివ్వరు?

ఈ మధ్య చాలా మందే ఈ ప్రశ్న వేశారు. సాటి మనుషులను ఎందుకు పీఠాధిపతులు గౌరవించరు? వారి కాళ్ళను ఎందుకు ముట్టుకోనివ్వరు? ఇది వివక్ష కాదా?

అసలు ఈ పీఠాలు , మఠాలు గురించి మనకు పూర్తి అవగాహన ఉందా? అక్కడ పీఠాలకు సంరక్షకులుగా ఉండే ఈ పీఠాధిపతులకు ఉన్న నియమ నిబంధనాలేమిటి మనకు తెలుసా? పూర్తిగా వివరాలు తెలియకుండా వారి మీద ఎగబడి పోయి వాళ్ళను ఇబ్బంది పెట్టడం భావ్యమా? వారి నిబంధనలు చెబితే ఎక్కడలేని మానవహక్కులు గుర్తుకొస్తాయే? వాళ్లకు వాళ్ళ నియమపాలన ఉండదా? వాళ్లకు ఎలా ఉండాలో అనే హక్కు వారికి లేదా? అంతవరకు ఎందుకు ఎందుకూ కొరగాని తైతక్కలాడే సినిమా స్టార్ల దగ్గరకు మిమ్మల్ని రానిస్తారా? వాళ్ళను ముట్టుకోలేదని మనం గోల పెడతామా? అక్కడొక రూలు ఇక్కడొక రూలా? వారికి వీరికి అసలు సాపత్యమే లేదు కానీ జనాల మధ్యకు వచ్చారు కాబట్టి ఈ ప్రస్తావన వచ్చింది. అసలు ఈ పీఠ నిబంధనలు, పీఠాధిపతుల వ్యవహారాల గురించి కొంచెం తెలుసుకోవడానికి ప్రయత్నించి అప్పుడు సమాధాన పడదాం.

“భారతీ విజయం” అన్న పుస్తకంలో దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠాధిపతి, జీవన్ముక్తులు అయిన శ్రీ శ్రీ శ్రీ భారతీతీర్థ స్వామీ వారి దైనందిన దినచర్య గురించి వివరణ ఉంటుంది. ఉదయాన్నే స్వామీ వారు నాలుగు గంటలకు లేచి స్నాన సంధ్యాదులు ఆచరించి, జపతపాదులు ఆచరించి 8 గంటలకు అనుష్టానం చేసుకుని శ్రీ చంద్రమౌళీశ్వరుని పూజ చేసుకుని గురువుల అధిష్టానాలు దర్శించుకుని వచ్చి విద్యార్థులకు పాఠం చెప్పి మఠ వ్యవహారాలూ సమీక్షించి 11 గంటలకు భక్తులకు దర్శనం అనుగ్రహించి వారి సమస్యలకు సలహాలు ఇచ్చి భక్తుల పాదపూజలు, భిక్ష స్వీకరించి తిరిగి 1 గంటకు మరల స్నానం చేసి మాధ్యాహ్నిక అనుష్టానం చేసుకుని భిక్ష స్వీకరించి సాయంత్రం 4:30 వరకు విద్వంశులతో శాస్త్రచర్చలు జరిపి అటుపై కార్యదర్శి తెచ్చిన ఉత్తరాలు పరిశీలించి వాటికి సమాధానాలు చెప్పి సాయంత్రం 5:30 నుండి 6:30 వరకు తిరిగి భక్తులకు దర్శనం ఇచ్చి మరల స్నానం, అనుష్టానం అటుపై 8:30 నుండి 10 వరకు శ్రీ చంద్ర మౌళీశ్వర పూజ, 11:30 వరకు శాస్త్ర గ్రంథావలోకనం చేసి విశ్రమిస్తారు, మరల మరునాడు 4 గంటలకు లేవడం. ఇంత ఒత్తిడి మామూలు వాళ్ళు తట్టుకోగలరా? ఇంక పర్వదినాలలో మరింత ఒత్తిడి.

అటువంటి శక్తివంతమైన అనుష్టానాలు చేసుకునే స్వాములు విజయ యాత్రలు చేస్తుంటే మరింత ఒత్తిడికి గురవుతూ ఉంటారు. వాటిని తట్టుకుని నిత్యం దైవనామస్మరణతో ఆత్మానుసంధానం చేస్తూ నడుస్తూ ఉంటారు. వారు నడిచే ధర్మస్వరూపాలు. అటువంటి శక్తిని కలిగి నడుస్తున్న వారిని తాకాలంటే మనకు అంత శక్తి ఉండాలి, లేదంటే మనకే కష్టం. అందునా వారి అనుష్టానం చేసుకునేటప్పుడు ఒక మడి , ఒక శౌచం, ఒక నియమం ఇలా ఎన్నో ఉంటాయి. మరి మనమో ఎంత శౌచం పాటిస్తున్నాము? ఉదాహరణకు భోజనాలు చేసిన తరువాత కాళ్ళు కడుగుకోవాలి, ఎంతమంది చేస్తున్నారు? మనం బయట నడుస్తున్నప్పుడు ఎందరినో తాకుతూ తిరుగుతున్నాము ? ఎవరికి ఎటువంటి శౌచాలున్నాయో ఏమేమి ముట్లు ఉన్నాయో, మనకు తెలియదు, అటువంటి వాళ్ళం మనం వెళ్లి వారిని తాకడం వలన వారు తమ బస చేరుకున్నప్పుడు ప్రాయశ్చిత్తాలు చేసుకుని తిరిగి ఎన్నో అనుష్టానాలు చెయ్య వలసి వస్తుంది. వారిని అంత బాధ పెట్టడం మనకు భావ్యమా? వారికి దూరంగానే సాష్టాంగ పడి వారి అనుగ్రహం పొందాలి. వారి పాదాలకు ప్రతినిధులుగా వారి పాదరక్షలు అక్కడ ఉంచితే వాటిని తాకి అనుగ్రహం పొందవచ్చు.

పీఠాధిపతులు నడిచే ధర్మ ప్రతినిధులు. ప్రతీ రోజూ జరిగే గొడవల్లో వారెందుకు పట్టించుకోరు అని మనవంటి అజ్ఞానులు అపోహ పడుతూ ఉంటారు. వారు చేస్తున్న ధర్మానుష్టానం వల్లనైనా ధర్మం నేడు కొంతైనా నిలుస్తోంది. వారు ఎందరో మెరికల్లాంటి ధర్మ రక్షకులను తయారు చేస్తూ ఉంటారు. జగత్తులో ఎవరికైనా ధర్మ సంకటం కలిగితే వారు వారి అనుమానాలు తీరుస్తూ ఉంటారు. నిత్యం జరిగే విషయాలను సరిదిద్దే వారెందరినో వారు తయారు చేస్తూ ఉంటారు. వారి తపః శక్తి, వాక్శక్తి భక్తులను అనుగ్రహించడానికి ధారపోస్తూ ఉంటారు. రోజువారీ గొడవల్లో పడి ఉంటే మరి ధర్మం పాటించే వారికి అనుమాన నివృత్తి ఎవరు చేస్తూ ఉంటారు? ఎవరు తపస్సు చేస్తూ శాస్త్రాలను పరిశీలిస్తూ, ధార్మిక కార్యక్రమాలు చేస్తూ, తరువాతి తరానికి వేదం, వేదాంగాలు, పురాణేతిహాసాలలో రహస్యాలను విప్పి చెప్పేవారు ఇతర ధార్మిక వ్యవహారాల సంగతి ఎవరు చూస్తారు? కాబట్టి వారు ధర్మ రక్షణకు కావలసిన రచన చేస్తూ శిష్యుల ద్వారా కాగల కార్యాన్ని చేయిస్తూ ఉంటారు. వారు స్వయంగా జీవన్ముక్తులైనా కేవలం ధర్మాన్ని అందరికీ అందజెయ్యడానికి, మోక్షార్థులకు దారి చూపడానికి మన మధ్య నడయాడుతున్నారు. వారు స్వయంగా ఆ దైవ ప్రతినిధులు. వారికి ఇవ్వవలసిన గౌరవం ఇచ్చి వారు చూపిన దారిలో నడవడం మన కర్తవ్యం.

!! ఓం నమో వేంకటేశాయ !!

!! సర్వమ్ శ్రీవేంకటేశ్వరార్పణమస్తు !!





# ఆచార్య ఆత్రేయ గారి జీవితంలోని ఒక సరదా సంఘటన..



మనసుకవి ఆత్రేయ పాట రాసే విధానం చాలా వింతగా ఉంటుంది. పగలంతా పిచ్చాపాటీతో కాలం గడుపుతారు. సిగరెట్ పేకెట్లూ.. పళ్లెంలో ఆరారగా ఫ్రూట్సు.. ఇవివుండి తీరాలి. అసిస్టెంట్ డైరెక్టరు పాట రాయించుకోవడం కోసం వస్తాడు, పేపర్లూ పాడ్‌తో. పెన్నుతెరిచి మరీ రెడీగా వుంటాడు. ఆ పెన్ను అలాగే వుంటుంది. ఫ్రూట్సు ఒకటీ అరా అవుతాయి. సిగరెట్లు మొత్తం ఖాళీ అవుతాయి. ఆయన నిద్రలోకి జారుకుంటాడు.

అంతే!

మళ్లీ సాయంత్రం.

ఫ్రెష్‌గా స్నానం చెయ్యడం

ధవళ వస్త్రాలు ధరించడం.. సిగరెట్ వెలిగించడం.

"ఎందాకా వచ్చాం?"

"ఏదీ... మొదలు పెట్టందే!"

"మొదలుపెడితే పాట పూర్తయినట్లే కదరా! ఆ మొదలు దొరకడం లేదు."

"ఓ మాట అనండి!"

"వేడి కాఫీ చెప్పు!"

"మాట అనమంటే ఇదా!"

ఇలా వుంటుంది ఆయన ధోరణి.

పాట పూర్తికాదు.

గంటలు.. రోజులు.. వారాలు గడుస్తుంటాయి.

"పాట" పుట్టదు.

హోటలుకి అద్దె పెరిగిపోతుంది. ప్రొడ్యూసరు లబోదిబోమంటాడు. సరిగ్గా ఇలా జరిగింది, పద్మశ్రీ పి పుల్లయ్యగారి మురళీకృష్ణ చిత్రానికి.

ఇద్దరిమధ్య మంచి చనువుంది. తిట్లూ- పొగడ్తలూ సర్వసాధారణం. ఆరోజు అమీతుమీ తేల్చుకోడానికి పుల్లయ్యగారొచ్చారు.

"పాట వొచ్చిందా?" పుల్లయ్యగారు.

"వొచ్చి చచ్చింది!" ఆత్రేయ సమాధానం.

"నన్ను చంపకు. ఇక రూమ్ వెకేట్‌చేసి బయలుదేరు!"

"ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నాను"

"సిగ్గులేదూ నీకు!"

"వుంటే సినిమాలకెందుకు పనిచేస్తాను!"

వీరి మాటల్లో బూతులు సర్వసాధారణం. అవి వ్రాయదగ్గవి కాదు.

కారు ఆత్రేయగారింటికేసి దూసుకుపోతోంది వేగంగా.

అంతకుమించిన వేగంతో వారిమధ్య మాటల యుద్ధం జరుగుతోంది.

పుల్లయ్యగారి ముఖంలో కోపం. ఆత్రేయ ముఖంలో చెక్కుచెదరని చిరునవ్వు.

"దిగూ! నువ్వు ఎక్కడవున్నా- ఏమైనా.. నువ్వు సుఖంగా వుండాలనే నేను కోరుకుంటాను!" అన్నాడు పుల్లయ్యగారు.

అంతే! ఏదో ఫ్లాష్ వెలిగింది.

కారు తిప్పు. మన ఆఫీసుకి పోనివ్వు.. అన్నాడు ఆత్రేయ.

"ఏం ఉద్ధరిద్దామని!"

"ఎలా- పోనియ్యవయ్యా!...

ఆఫీసు చేరుకుంది కారు.

"ఎక్కడవున్నా- ఏమైనా"

మనమెవరికి వారై వేరైనా...

నీ సుఖమే నే కోరుతున్నా

నిను వీడి అందుకే వెళుతున్నా- పాటకి...పల్లవి. వచ్చేసింది.

అనుకున్నామని జరగవు అన్ని

అనుకోలేదని ఆగవు కొన్ని

జరిగినవన్నీ మంచికనీ,

అనుకోవడమే మనిషి పనీ... చరణం వొచ్చేసింది-

ఇక రెండవ చరణం-

'వలచుట తెలిసిన నా మనసునకు

మరచుట మాత్రం తెలియనిదా

మనసిచ్చినదే నిజమైతే

మన్నించుటయె రుజువుకదా- రెండవ చరణం వచ్చేసింది.

ముక్తాయింపు వుండాలి కదా-

"నీ కలలే కమ్మగా పండనీ.

కలకాలం నీలో దాగనీ..

చిరంజీవిగా వుండాలనీ..

దీవిస్తున్నా.. నా దేవినీ.. దీవిస్తున్నా నా దేవిని..

పాట అయిపోయింది. పుల్లయ్యగారికి నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి. ఆత్రేయ చేతుల్ని ముద్దుపెట్టుకొని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

ఈ పాట మాస్టర్ వేణు చేతుల్లో పడింది. ఆయన ట్యూను చేస్తూ ఏడవడం మొదలుపెట్టాడు. రిహార్సల్స్‌లో ఘంటసాల మాస్టారు విన్నారు. ఆయన ఆ పాటకి ప్రాణం పోశారు. ఘంటసాల మాస్టారి జీవితంలో అత్యంత ఇష్టమైన పాట.

వేణు మాస్టారికి ప్రాణం ఈ పాట.

పుల్లయ్యగారికి ఈ పాట ఆరో ప్రాణం...

అక్కినేని నట జీవితంలో పూర్ణాయుష్షు నింపుకున్న పాట ఇది!

అయితే ఆత్రేయకిది కేవలం 'పాట విడుపు' మాత్రమే!





# రేడియో తాతయ్య

"ఆదివారమిదిగో వచ్చే ఆటవిడుపు మనకు నేడు...." ఆదివారం వస్తే మాకు బాల్యం లో నిజంగానే ఆటవిడుపు. మద్రాసు ఆకాశ వాణి కేంద్రానికి ఉదయాన్నే తయారయి వెళ్ళేవాళ్ళం. మా రేడియో తాతయ్య మల్లంపల్లి ఉమా మహేశ్వర రావు ఆ రోజుల్లో ఆయన పేరు (రేడియో తాతయ్య, ఉమ అనే పేర్లతో చిర పరిచితులు) వినని తెలుగు వారు మద్రాసు నగరంలో లేరంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. మద్రాసు నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి చిన్న పిల్లలు బిలబిల మంటూ గుమిగూడేవారు. పద్యాలు, పాటలు, నాటిక, ఇత్యాది కార్యక్రమాలతో పాటు ఒక ప్రముఖ వ్యక్తితో ముఖాముఖీ ఇలా మాకు రేడియో స్టేషన్‌లో సమయం ఎలా గడిచి పోయేదో తెలిసేది కాదు. దేశ భక్తి గీతాలు మాచేత పాడించడము, లేదా రికార్డెడ్ దేశ భక్తి గీతాలు కార్యక్రమంలో వేయటమో చేసేవారు. అందులో " పిల్లల్లారా పాపల్లారా రేపటి భారత పౌరుల్లారా .." అనే దేశ భక్తి గీతం ఆలపించిన ప్రతిసారీ మా శరీరంపై రోమాలు నిక్కపొడుచుకునేవి.

పిల్లల ఉచ్చారణ సరిగ్గా లేకపోయినా , వాక్యాలు తప్పు దొర్లినా మా తాతయ్య ఊరుకునే వాడు కాదు. బాగా వాక్శుద్ధి వున్న పిల్లలని ఎంపిక చేసి ఆ రోజుల్లో ధారావాహికలుగా నాటికలని రికార్డింగ్ చేయించి మా తాతయ్య రేడియో లో ప్రసారం చేసేవాడు. కొన్ని సార్లు మాచేత లైవ్ రికార్డింగ్ చేయించి కార్యక్రమాన్ని ప్రసారం చేసేవారు. ఆ సమయంలో మా తాతయ్య టైం సెన్స్ కానీ, పొరపాట్లు దొర్లితే వాటిని సమయస్ఫూర్తి తో నెట్టుకుని రావటం కానీ ఆయనని చూసి నేర్చుకోవలసిందే కానీ వివరించనలవి కానిది. మా తాతయ్య సమయస్ఫూర్తి కి ఒక మచ్చు తునక. ఒకసారి అన్ని తెలుగు స్కూళ్ల పిల్లలకి క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. దాదాపు ఏడు, ఎనిమిది స్కూళ్ళ నుంచి పిల్లలు వచ్చారు. అందులో ఒక ప్రశ్న, టట తెలుగు క్యాలెండరు ప్రకారం ఇవాల్టి తిథి "చెప్పమన్నారు. ఎవ్వరూ చెప్పలేదు. నేను చెప్పాను. అది సరయిన సమాధానం అవటంతో తాతయ్య మరో ప్రశ్నకి వెళ్ళిపోయాడు. అప్పుడు నాకు స్ఫురించింది అది రికార్డెడ్ ప్రోగ్రాం కాబట్టి ప్రసారం అయ్యే రోజు నాటి తిథి వేరే ఉంటుంది అని. ధైర్యం చేసి ఎలాగో తాతయ్యకి చెప్పాను. (రికార్డింగ్ సమయంలో తాతయ్య చాలా గంభీరంగా ఉండే వాడు) వెంటనే తాతయ్య ఆ కార్యక్రమం ప్రసారం అయ్యే రోజు వచ్చే తిథి సరి చూసి మళ్ళీ నాచేత చెప్పించాడు.

మా రేడియో తాతయ్య ప్రఖ్యాత చారిత్రిక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి సోదరులు. 1939 లో మద్రాసు ఆలిండియా రేడియో వారు తొలిసారిగా వారాంతంలో పిల్లల కార్యక్రమం ప్రారంభించారు. అప్పట్లో శ్రీమతి దుర్గాబాయమ్మ గారు ( వీరు తదనంతరం శ్రీ సీ.డీ. దేశ్ ముఖ్ గారిని వివాహమాడి దుర్గాబాయి దేశ్ ముఖ్ గా పేరుగాంచారు) రేడియో అక్కయ్య గా సుప్రసిద్ధులైన న్యాయపతి కామేశ్వరి గారు (రెడియో అక్కయ్య గారు) వారం విడిచి వారం వరుసగా ఈ పిల్లల కార్యక్రమాన్ని నడిపేవారు. దుర్గాబాయమ్మ గారు ఆంధ్ర మహిళా సభ నిర్వహణ బాధ్యతలతో తీరిక లభించక పిల్లల కార్యక్రమాన్ని విడిచి పెట్టారు. అప్పుడు న్యాయపతి కామేశ్వరి గారు వారి భర్త న్యాయపతి రాఘవ రావు గారు ( రేడియో అన్నయ్య గారు)కలిసి మద్రాసు రేడియో లో పిల్లల కార్యక్రమాన్ని పూర్తి బాధ్యత తో నిర్వహించారు. వీరు అప్పట్లో పిల్లల కోసం రేడియో తాతయ్య, మొద్దు అబ్బాయి, జిలేబీ, మిరపకాయ, జేజి మామయ్య, పొట్టి బావ, చిట్టి మరదలు ఇత్యాది పాత్రలు సృష్టించారు. జేజి మామయ్య, మొద్దు అబ్బాయి పాత్రలతో బాలాంత్రపు రజనీకాంత రావు ,ప్రయాగ నరసింహ శాస్త్రి గార్లు, తాతయ్య పాత్రతో మల్లంపల్లి ఉమామహేశ్వర రావు స్వయంగా పాల్గొని రేడియో నాటికల్లో పిల్లలని ప్రోత్సహించి వారిచేత ఇతర పాత్రలని వేయించే వారు. మా బాల్యం లో ఈ రేడియో పిల్లల కార్యక్రమం ఆటవిడుపుగా రూపాంతరం చెందింది. దీనికి తాతయ్య సూత్రధారుడిగా ప్రసిద్ధి పొందాడు.

రికార్డింగ్ లో కంచు కంఠం తో ఎంత గంభీరంగా ఉండేవాడో , ఆ తరువాత మాతో సరదాగా కబుర్లు చెప్పేవాడు. అప్పటి పిల్లల్లో చాలామంది పెద్దవాళ్లయ్యాక ప్రఖ్యాత కళాకారులుగా ప్రసిద్ధిగాంచారు. ప్రవాసాంధ్రులం అయినప్పటికీ మా తరానికి మాతృభాష తెలుగు మీద అభిమానం, ఆసక్తి, పట్టు కలగటానికి మద్రాసు ఆలిండియా రేడియో, రేడియో తాతయ్యల పాత్ర ఎంతో వుంది. విద్యా బుద్ధులు నేర్పించిన కొందరు గురువులు బాల్యంలో మా మీద ఎంతటి ప్రభావాన్ని చూపించారో, అంతకు సమానంగా మా తాతయ్య ప్రభావం ఇప్పటికీ మాలో చెరిగిపోకుండా శాశ్వతంగా నిలిచిపోయింది.

– బి.యస్.వి. పార్థసారథి

## కేవలం య, ర, ల, వ, శ, ష, హ అనే ఎనిమిది అక్షరాలతో శేషశైలేశ స్తుతి

**క. శ్రీలీలావేలలల**
**ల్లాలస వరవల్లవీ విలాస విలోలాలా**
**శాలిహసాస్య శశీ వర**
**శీలా శ్రీ శేషశైల శీ ర్వావాసా!**

క, చ, ట, త, ప –అనే ఐదు వర్గాక్షరాలకు చెందిన 25 అక్షరాలలో ఏవీ ఈ పద్యరచనలో ఉపయోగించలేదు.ఇలాటి రచనను అపంచవర్గీయ రచన అంటారు.

గద్వాల సంస్థాన విద్వత్కవి కాణాదంపెద్దన సోమయాజిగారు శేషశైలేశలీల అనేపేరుతో ఒక కావ్యమే ఈ ఎనిమిది అక్షరాలతో రచించి నారు. అయితే దురదృష్టవశాత్తు నేడు మనకు ఆ కృతి అలభ్యంగా ఉంది.

గద్వాలకవివర్యుడు పోకూరికాశీపతిగారు కాణాదంవారిని ఆదర్శంగా అపంచ వర్గీయాక్షరాలతో "శౌరిశైశవలీల" అనే కృతిని రచించినారు.ఇది చాలా ఏండ్లనాడు ముద్రితంకూడా.

ఇలాటి రచనలు ముక్కును మూసుకుని చదివినాకూడ నంగిలేకుండ స్పష్టంగ పలుకబడుతాయి.

పరీక్షించాలనుకుంటే మీరూ గట్టిగా ముక్కును చేతితో బిగపట్టి పద్యాన్ని చదవండి, స్పష్టంగ ఉచ్చారణ ఉంటుంది.దానికి కారణంపద్యంలోని అక్షరాలలో అనునాసిక వర్ణాలు లేకపోవడమే.

– వైద్యం వేంకటేశ్వరాచార్యులు


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# వెనుకబడినవారినీ, అన్య మతస్థులనీ ఉన్నత పదవుల నధిష్టింపచేసింది భారత రాజ్యాంగమే!! రాజ్యాంగ సూత్రాన్ని అమలుపరచడంలో పొరబాటు ఉందేమో కానీ, రాజ్యాంగంలో లేదు.

దేశం వెనుకబడి ఉండరాదు! వెనుకబాటుతనాన్ని తరిమికొట్టాలి! అందరికీ విద్య అందుబాటు కావాలి! అందరికీ ఉపాధి లభించాలి! అందరూ ఆనందంగా ఉండాలి. దేశ పటిష్టతకూ, ఆర్థిక పరిపుష్టికీ – ఇవి పంచశీల సూత్రాలు కావాలి!

భారత రాజ్యాంగ రచనాకర్తల్లో అంబేత్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, దుర్గాబాయ్ వంటి మేధావులను నియమించుకుని భారతదేశం రాజ్యాంగ రూపకల్పన చేసుకున్నది. స్వతంత్ర భారతదేశం నుంచీ పాకిస్థాన్ విడిపోయింది. అబ్దుల్ కలాం ఆజాద్ వంటివారు పాకీస్థాన్ వెళ్ళడానికి అనంగీకారం తెలిపారు. అలాటి దేశభక్తి కలవానికి భారత తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖా మంత్రి పదవినిచ్చారు; అంబేత్కర్‌కు న్యాయశాఖా మంత్రి పదవినిచ్చారు. ఇవి రెండూ తొలి కేంద్ర మంత్రి మండలిలో ప్రాధాన్యత కల పదవులు!

వెనుకబడిన వర్గాలకు మంచి మంచి పదవులనధిష్టింపచేసినది భారత రాజ్యాంగం. నగరి నుంచీ వచ్చిన హరిజన నాయకుడు బి.ఎస్. మూర్తికి సహాయ మంత్రి పదవిని కల్పించింది. జకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ మహమ్మద్, అబ్దుల్ కలామ్ ప్రభృతుల్ను రాష్ట్రపతుల్ను చేసింది! అలాటి భారత రాజ్యాంగం అన్య మతస్థులనూ, వెనుకపడిన వర్గాల వారిని ఉపేక్షించకుండా – న్యాయేన, ధర్మేన మార్గం అవలంబించింది.

పాకిస్థాన్ విడివడినా, అప్పటి మన నాయకులు, హిందూస్థానంగా ప్రకటించుకో లేదు, ఇది దురదృష్టకర విషయం. భారత్‌ను పటిష్టమయిన ప్రజాస్వామ్య దేశంగా యావత్ప్రపంచ దేశాలూ ప్రశంసించాయ్. కేంద్ర ప్రభుత్వం యొక్క అలీన విధానం – ఏ అగ్ర రాజ్యానికీ కొమ్ము కాయలేదు, కాలేదు!

ఇంత విశాల దృక్పథం కల భారతదేశంలో – సంకుచిత మనం కలవారు, దాస్యభావుకులూ, దోపిడిదారులూ బయల్దేరడం వల్లనే – ఆర్థికంగా ఎదగలేక పోతున్నది. వెనుక యేర్పడిన సింగపూర్ వంటి దేశాలు – భారత్ కన్నా ఆర్థికంగా, సాంకేతికంగా బలపడడాన్నించుక పరిశీలించాల్సి వున్నది! మనం చూడాల్సింది వారి భవనాలు కాదు! మనం దానినే చూచి గర్విస్తున్నాం. వారికి వనరులు లేవు! జీవ నదులు లేవు! పంటలు లేవు. మనకు మించిన విజ్ఞానవంతులా! పరిశోధకులా! యని ఆలోచించుకొనే సమయం వచ్చింది. అంతరిక్ష పరిజ్ఞానకర్తలు మనకున్నారు – జ్ఞానవంతులున్నారు. కానీ ప్రతిభావంతులు పరదేశాలకు పోతున్నారు. కొందరు విజ్ఞానవంతులకిచట ఉపాధి దొరకక విదేశాలు పోతున్నారు. వారి జ్ఞాన సంపదనచటే పంచిపెడుతున్నారు. భారతీయులు కష్టించి పనిచేస్తారనే నమ్మకం ఆయా దేశస్థుల్లో ఉన్నది. అరబ్బు దేశాల్లో కష్టించి పన్చేసే కూలీలను తీసుకునేవారు. ఇప్పుడు పై ఉద్యోగాలకు కూడా భారతీయుల్నే తీసుకుంటున్నారు. వాళ్ళకు లక్షలు లక్షలు నెలసరి జీతములిస్తున్నారు.

వీరి కారణంగా మన మేధా సంపదను అక్కడికే పంపించేస్తున్నాం. భారత రాజ్యాంగ రచనా నిపుణుల్లో ఒకరైన బి.ఆర్. అంబేత్కర్ గారు భారతీయుల్లోని వెనుకపడినవారికి విద్యా ఉపాదులు అవసరమనీ – అవి నిర్ణీత కాలమే ఉండాలని నిర్దేశించడమే గాకుండా, విరామమెరుగకుండా పనిచేసేవారు అంబేత్కర్ సూచనలను భారత నాయకులు రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులుగనూ, మంత్రులను చేసారు. ఈ సత్యాన్ని వెనుకపెట్టి వెనుకబడినవారికి మంత్రి పదవులనివ్వడంలేదని కొందరు నిందారోపణలు చేసారు. ఇప్పటి మంత్రివర్గాల్లో కొన్ని వర్గాలకు స్థానం ఉండలేదు. వారికిచ్చే ఎం.ఎల్.ఏ. సీట్లు అరకొరగా ఉన్నాయ్. బ్రాహ్మణులు, వైశ్యులు, రెడ్లూ మంత్రులుగా నున్నప్పుడు ఎందరో యితర వర్గాలకు స్థానం కల్పించారు. ఎగువ తరగతిలో ఎంతోమంది ఆర్థికంగా బాధపడుతున్నవారున్నారు. ఆర్థిక పరిస్థితులను బట్టి – వెనుకపడినవారిని గుర్తించాలి. కులం ప్రాతిపదికగా నిర్ణయించడంవల్లనో, ఏమో – తమనూ వెనుకపడిన తరగతి జాబితాలోనికి చేర్చమని అగ్రకులాలవారు అడుగుతున్నారు.

విద్య, విజ్ఞానములందు పరిణితి చెందిన వారినీ, అర్హతలున్న వారినీ – వెనుకపడి విద్యా విజ్ఞానార్హతల్ను బట్టి అగ్ర, వెనుకపడిన శ్రేణిని గుర్తించినప్పుడన్ని తరగతి వారల్లోనూ పోటీ యేర్పడి, విజ్ఞాన సంపన్నులు పెరుగుతారు, విజ్ఞాన సంపన్నులైనవారు ఉపాధి వెదుక్కుంటూ అన్య దేశాలకు వెళ్ళరు.

అందరూ విజ్ఞానవంతులు కావాలని అంబేద్కర్ ఆశించారు. వారి రిజర్వేషన్ల పరమార్థ ఆంతర్యమిదే! ●

## ఆఫ్ఘనిస్థానములో తెలుగు ఎలా వచ్చిందబ్బా?

ఆంధ్రులైన శాతవాహనులు బిఫోర్ కామన్ ఎరా 833 వ సంవత్సరం నుండీ బిఫోర్ కామన్ ఎరా 1327 వరకూ దాదాపు 506 సంవత్సరాలు ముప్పది మందికి పైగా చక్రవర్తులు రాజ్యమేలారు. వీరి సామ్రాజ్యం అతి సువిశాలంగా నేటి ఆఫ్ఘనిస్తాన్ వరకు ఉండెడిది. దేశములో చాలారాజ్యాలు శాతవాహనులు సార్వ భౌమత్వం అంగీకరించి పాలించెడి వారు. చక్రవర్తుల తరపున రాజబంధువులు ఆయా ప్రాంతాలలో రాజప్రతినిధులుగా కూడా ఉండెడి వారు. మనం 1925 నాటి జనాభా లెక్కల ప్రకారం తెలుగు భాష మ్యాప్ మాటాడేవారి సంఖ్య చూస్తే అందులో ఆనాడు ఎందరు తెలుగు మాటాడే వారు దేశ వ్యాప్తంగా ఉండెడి వారు అన్నది కూడా మనకు తెలుస్తుంది. 1925 నాటికీ బలూచిస్తాన్ లో మొత్తం 42 వేలమంది తెలుగు మాటాడే వారు ఉన్నట్టు ఈ మ్యాప్ చెబుతోంది మనకు

ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాలు అవన్నీ ఒకపుడు ఆటవిక జాతి జీవించేవారు. పుష్యమిత్రుని కాలములో మన దేశం నుండి వెడలగొట్టబడిన వేద బాహ్యులు కూడా ఆ ప్రాంతాలలో అనేకులు ఉండేవారు. ఆ ప్రాంతాలలో కొన్ని తెగలు మాటాడే భాష పేరు బ్రాహుయీ. ఈ భాష మన తెలుగు భాషకు దగ్గరగా ఉంటుంది అని కాల్డ్వెల్ అనే ఆంగ్లేయుడు చెబితే దానిని తమిళులు కాదు అది ద్రావిడ భాషకు దగ్గరగా ఉంది అటూ తమదిగా స్వంతం చేసుకోనెంచారు . నిజానికి తమిళులు అంత వరకూ తమ సామ్రాజ్యాలను విస్తరించలేదు. నేటికీ బలూచిస్తాన్, ఇరాన్ , తుర్కెమెనిస్థాన్ , కతార్ ఇలా కొన్ని ప్రాంతములో దాదాపు ముప్పది రెండు లక్షలమంది దాకా ఈ భాష తెలిసిన వారు ఉన్నారని తెలుస్తోంది.

ఇపుడు అనేకులు ఆ భాష మాటాడ్డం మానివేశారని , అది కూడా అంతరించి పోయే భాషల్లో ఒకటని కూడా తెలుస్తోంది. ఎక్కడో కొన్ని వందల కిలోమీటర్ల దూరములో ఉన్న భారతీయ భాష తెలుగు లక్షణాలు, పదాలు అక్కడకు ఎలా వెళ్లాయి ? బహుశా ఆ ప్రాంతానికి వెళ్లిన రాజబంధువులు కొందరు ఎవరో మన భాషను అక్కడ వరకు చేరవేశారు. ఆలా మన తెలుగు భాష లక్షణాలు అక్కడ స్థానిక ఆటవిక భాషలో కలసి అదో ప్రత్యేక భాష అయికూర్చున్నది. అదండీ సంగతి. గతమెంతో ఘన చరిత్రగలిగిన ఆంధ్ర ప్రాంతము కాకతీయులు, విజయ నగర రాజుల తర్వాత కొన్ని వందల ఏళ్లుగా కులాల కుమ్ములాటల్లో పడీ చివరకు తన ఉనికినే కోల్పోతున్నది ఆంధ్ర జాతి. **(ఫేస్‌బుక్ నుంచి సేకరించడమైనది)**


*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**

**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

# చెన్నైలోని తెలుగు పాఠ్యబోధనా సౌరభాన్ని వేళ్లతో పెకలించుకుపోయిన వారెందరో!

## కాపుకు వచ్చిన తెలుగు పంటను కోసుకుని పోయారు

ఈ నేల మనదిరా! ఈ సీమ మనదిరా! ఈ తేమ మనదిరా! ఇక్కడ మొలచిన మొక్క మనదిరా అను మాట తెలుగు వట వృక్షంలా చెన్నపట్టణమంతా పరచుకున్నది.

గూడులు వేసిందివాడు! పాకలు వేసిందివాడు! ఇళ్లు కట్టిందివాడు! బళ్లు కట్టింది వాడు! సత్రాలు నిర్మించింది వాడు! చావిళ్లు నిర్మించిందివాడు!

చెన్నయ్ సెంట్రల్ స్టేషన్ వామభుజంగా చెన్నపురి ఆంధ్ర మహాసభా! ఆ సభనందు విరాజిల్లిన తెలుగు సాహిత్యం, కళలు, కవితా సమ్మేళనములు! గళం విప్పిన ఘనఘనాతి నటులు, రిప్పన్ బిల్డింగులో తొలి తెలుగు మేయర్ త్యాగరాజ శ్రేష్ఠుని స్మారక చిహ్నం, కేసరి విద్యాలయములు, కలవళ కణ్ణన్ చెట్టి విద్యాలయములు మద్రాసు ప్రెసిడెన్సీలో పాఠ్యాలు బోధించిన హేమాహేమీలు, వ్యాకరణం బాటవేసిన పరవస్తు చిన్నసూరి! తెలుగు సంస్కృత భాషల్లో అనేకానేక కావ్య గ్రంథాలను ప్రచురించిన వావిళ్ల రామశాస్త్రులు సన్సు! వారే తొలి తెలుగు –అచ్చు జీ.పి. పాయింట్ కారకులు.

ఎంబెరుమానార్ చెట్టి, హో అందుకో, మద్రాసు పెన్సిల్ ఫ్యాక్టరీ! గామా పెన్నులు! బ్రహ్మం పెన్నులు! భారత చలనచిత్ర రంగంలో బహు ఉన్నతంగా 14 ఫ్లోరులుగల విజయా వాహినీ స్టూడియోలు, దేశవిఖ్యాతి గొన్న బి.ఎన్.కె ప్రెస్, ప్రసాద్ ప్రాసెస్, దేశదేశాల్లో విజయ బావుటా ఎగురవేసిన చందమామ పిల్లల పత్రిక, మైసూర్ బృందావనం గార్డెన్స్ వెళ్ళ నవసరం లేకుండా సకలవన సంశోభితంగా, పారిజాతవనంగా తీర్చిదిద్దబడిన విజయాగార్డెన్స్, కార్పొరేట్ రంగంలో తొలిగా తీర్చిదిద్దబడిన అపోలో ఆసుపత్రి, కేసరీ విద్యా సంస్థలు, దివాన్ బహద్దూర్ కలవల కణ్ణన్ చెట్టి విద్యా సంస్థలు, కన్యకాపరమేశ్వరీ చారిటీస్ సంస్థలు, ఆర్యవైశ్యుల వైభవ వితరణలు, ధర్మ సంస్థలు అన్నీ ఉండీ, తెలుగువారు ఏంవీ లేనివయ్యారు.

దేశంలో అతి గొప్ప స్టూడియో చిత్ర నిర్మాణ కేంద్రమైన ఆంధ్రా హాలీవుడ్!

అన్నిటికీ నెలవైన చెన్నయ్ తెలుగు విద్యా రంగం, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన తెలుగు విద్యాలయాలు కూకటివేళ్ళతో పెకలించుకుపోయిన తెలుగువారి శ్రమైక సినిమా పరిశ్రమను ఊసెత్తకుండా ఉండగలమా? ఎలా ఉండగలం.

ఏ తెలుగు సినిమా పరిశ్రమ కారణంగా చెన్నయ్ ద్వారాలకు తెలుగు తోరణాలు కట్టుకున్నదో, ఎవరెవ్వర్ని గొప్ప నటులు నటీమణులు కోట్లు సంపాదించి కోటలు కట్టినవారిగా చేసిందో వారే చెన్నయ్‌లోని తెలుగును చెరిపేసారు.

దిగంతాలను చాటిన తెలుగు సినిమా వెలుగు చెన్నయ్‌లో వెలుగు లొలికింప చేసింది.

తెలుగు సినిమా, మూడు పూలు ఆరు కాయలుగా ప్రవర్ధిల్ల చేసినదీ నేల చెన్నయ్ నేల!

తెలుగువాడి స్వేదబిందువులతో ఈ నేల నెలకొన్నది. ఈ నేలను పాలించిన వాడు తెలుగువాడు! న్యాయం వాదించినవాడు తెలుగువాడు! న్యాయమూర్తిగా న్యాయం నిర్ణయించి చెప్పినవాడు తెలుగువాడు!

రాజకీయాల్లో రాణించినవాడు తెలుగువాడు! రాజకీయ పార్టీలు ప్రారంభించిన వాడు తెలుగువాడు! కళలను పోషించినవాడు తెలుగువాడు! కట్టడాలను కట్టించినవాడు తెలుగువాడు!

పరిశ్రమలు స్థాపించినవాడు తెలుగువాడు! పారిశ్రామికాభివృద్ధినొందించినవాడు తెలుగువాడు! బట్టలవ్యాపారి తెలుగువాడు! బంగారు వ్యాపారి తెలుగువాడు! విద్యాలయాలు స్థాపించినవాడు తెలుగువాడు!

ఆర్యవైశ్యులందరూ తెలుగువారే! ఆర్ష ధర్మపరులందరూ తెలుగువారే!

బ్రాహ్మణులు, వైశ్యులు, రెడ్లు, కమ్మవారు, కాపువారు. వెలమవారెందరో ఇక్కడ వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసి చెన్నయ్‌ను విస్తృతపరచారు. కొందరు కొన్ని వృత్తులవారితో సంబంధాలు కలుపుకుని వారి వారితో కలిసిపోయినా, వారి సంస్కృతి మూలాల్ని మరచిపోనిదీ నేల!

కలకత్తా, కొల్హాపూర్, ముంబాయి వంటి నగరాలలో ఉన్న తెలుగు సినిమాల నిర్మాణాన్ని చెన్నయ్‌కు గొనివచ్చి, తెలుగు సినిమాలను నిర్మించి, స్టూడియోలు కట్టి, థియేటర్లు కట్టి దేశంలోనే ముఖ్య సినిమా కేంద్రంగా రూపులు దిద్దినది చెన్నయ్ కోడంబాకం, వడపళని ప్రాంతాలను ఆంధ్రా హాలీవుడ్‌గా తీర్చిదిద్దిన వారు తెలుగువారు. వాడవాడలా వారే పెరిగిపోయారు.

భాషా రాష్ట్రాలుగా విడిపోయి ఆంధ్ర రాష్ట్రం యేర్పడి కర్నూలు రాజధానిగా వెళ్ళినా, ఒక్క సినిమా నిర్మాణ సంస్థగానీ స్టూడియోగానీ వెళ్ళలేదు. బెంగుళూరు తిరువనంతపురంలో స్టూడియోలున్నప్పటికినీ ఆంధ్రా హాలీవుడ్‌లోనే సినిమాలు తీసారు.

ఆంధ్రప్రదేశ్ యేర్పడి సారథీ, భాగ్యనగర్ స్టూడియోలున్నప్పటికినీ, మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా సినిమా పరిశ్రమను తరలించుకుపోవాలని భావించినా పోలేదు.

ఎన్టీ రామారావుగారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన ప్రక్కనున్న వారి ఆలోచనలతో, హైదరాబాదు వచ్చే సినిమా వారికి ఉచిత స్థలాలిస్తాం. ఇళ్లు కట్టి పెడతాం. వినోదపన్ను సడలిస్తాం, అక్కడ విధిగా చలనచిత్రాల్ను నిర్మించేవారికీ తాయిలాలు కల్పించడంతో నటీనటులూ, దర్శకులూ అక్కడకు తరలిపోయారు.

ఆంధ్రా హాలీవుడ్‌లో చలనచిత్ర నిర్మాణమునకు సంబంధించినవారూ, వారి కారణంగా బ్రతుకుతున్న వారూ, – ఇక్కడ నిర్మించుకున్న యిళ్లను, కాలనీలు, నాగార్జున నగర్, ఎంజిఆర్ నగర్‌లలో నిర్మించుకున్న ఇళ్లను అమ్మివేసుకొని వెళ్ళిపోయారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సంబంధించినవారెందరో ఉన్నారు. చదువుకుంటున్న వారి పిల్లలెందరో వున్నారు. వీరందరూ చాపలు చుట్టుకుని వెళ్ళిపోయేసరికి పాఠశాలల్లోని వారి తెలుగు పిల్లల సంఖ్య తరిగిపోయింది. పాఠశాల తరగతుల్లోని తెలుగు పిల్లలు తరగతికి ఒక్కరూ లేకుండా పోయారు. తెలుగు పాఠ్య సిలబస్ ప్రకారం ముద్రింపబడే పాఠ్య గ్రంథాల శకం ముగిసిపోయింది. తెలుగు బోధించే పాఠశాలలో తెలుగు చదివే పిల్లల సంఖ్య ఏక సంఖ్యలోకి రావడంతో విద్యాశాఖ ఏంవీ చేయగలదు? ప్రభుత్వం ఏవి చేయగలదు? ఉన్న తెలుగువారేం చేయగలరు?

గరిష్ఠ పరిమితుల్లో నిర్మింపబడే తెలుగు చిత్రాలు లేకపోవడంతో చాలా స్టూడియోలు మూతపడ్డాయ్. విజయా వాహినీ స్టూడియోస్, విజయా లేబొరేటరీ విజయాగార్డెన్స్ విజయా రికార్డింగు థియేటర్స్ అన్నీ మూతబడ్డాయ్.

విజయ నగర సామ్రాజ్యంలా విజయ వాహినీ కూటమి పోవడంతో చిన్న చిన్న వేషాలు వేసేవారు రోడ్‌మీద పడ్డారు. ఆసుపత్రికి హెల్తు సెంటర్‌కు ఆ భవనాలు, వనాలు, షూటింగ్ ఫ్లోరులన్నీ, హోటళ్లుగానూ, షాపింగు కాంప్లెక్సుగా మారిపోయాయి. తెలుగువారు తెలుగు పిల్లల చదువుల కోసం నెలకొల్పిన పాఠశాలలు తమిళ పాఠశాలలుగా మారిపోయాయి. తెలుగు వాచకాలు, ఉపవాచకాలు ముద్రించే అరుణా పబ్లిషింగ్ హౌస్ వంటివి మూతబడ్డాయ్. తెలుగు ప్రెస్సులు మూతబడ్డాయ్. తెలుగు చిత్రసీమవారు కొందరు ఎడమ చేత్తో చావుదెబ్బ కొట్టిపోయారు. ఫిలిం ఛాంబర్లలో తెలుగు సినిమా పరిశ్రమలోని సభ్యులు తెలుగు సభ్యులు తగ్గిపోయారు! తెలుగు కాలనీలు, ఇల్లుకట్టుకున్న తెలుగువారిళ్లు తమిళ సొత్తయి పోయింది. ఇలా తెలుగు విద్యా వెలుగు కృష్ణ పక్షంలోకి ప్రవేశించింది. ప్రభుత్వం తెలుగు విద్యకు మంగళం పలికింది. ●

శ్రీరాములవారు అరణ్యవాసం ముగించుకుని అయోధ్యానగరానికి తిరిగి వచ్చారు. తల్లి కౌసల్యమ్మకు నమస్కారం చేశాడు. చాలాసమయం అరణ్య వాసంలో రాముడు పడిన ఇబ్బందులనుగురించి తెలుసుకుంది ఆ తల్లి. రామునితోః–

కౌసల్య: రామా! రావణాసురుణ్ణి నీవే చంపావా!!

రాముడు: అమ్మా! మహాజ్ఞానీ, మహాప్రతాపవంతుడూ, మహా బలశాలీ, మహాపండితుడూ, మహాశివునిభక్తుడూ, శివతాండవస్తోత్రం రచించి శివుడినే ఆనందింపజేసిన మహాకవీశ్వరుడూ అయిన రావణబ్రహ్మను, అతడి అహంకారమే అతడిని చంపింది.

**సత్యసందర్శనం చేద్దాం.**

**అహంకారానికి దూరంగా ఉందాం.**

– వైద్యం వేంకటేశ్వరాచార్యులు

జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

# సౌశీల్యమే జాతికి ప్రాణం



- స్వామి వివేకానంద

## బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి



*గొల్లపూడి ఇక లేరు అనే వార్త వినడం చాలా బాధ కలిగించింది. అంతకు రెండు రోజుల క్రితం శ్రీ సి.ఎం.కె.రెడ్డి గారితో ఆయన హాస్పిటల్‌లో నవ్వుతూ మాట్లాడుతున్న వీడియో వాట్సప్‌లో చూసినప్పుడు కూడా ఇలా జరుగుతుందని నేనూహించలేదు. ఆయన సంస్మరణ సభ ఆస్కాలో శ్రీ జె.కె.రెడ్డి గారు, ద్రవిడదేశం కృష్ణారావుగారి ఆధ్వర్యంలో జరిగింది. నేను వెళ్ళి ఓ నాలుగు ముక్కలు పంచుకోవాలనిపించి వెళ్ళాను. నా కన్నముందు సూర్యప్రకాశరావు, వెన్నెలకంటి, భువనచంద్ర, భానుచందర్, ప్రభ, ఘంటసాల రత్నకుమార్, జె.కె.రెడ్డి, ద్రవిడ దేశం కృష్ణారావు గార్లు మారుతీరావుగారి జ్ఞాపకాలను పంచుకున్నారు. నేను మా సినిమా 'కాలరుద్రుడు'లో ఆయన విలన్‌గా నటించడం, ఒక వారం రోజులు ఆయనను ప్రత్యక్షంగాను, అప్పుడప్పుడు ఫోన్‌లో జరిగిన సంభాషణను గుర్తుచేసుకుని మాట్లాడాను. మొన్న ఉగాదికి ఆయన్ను మా తెలుగు బ్రాహ్మణ మహాసభలో గౌరవ అతిథిగా ఆహ్వానించడం అక్కడ ఆయన ప్రసంగం నా కళ్ళముందు అలాగే సజీవంగా వుంది. పుట్టిన ప్రతివారు మరణించక తప్పదు. అయినా కొంతమంది మరణించినప్పుడు ఇంకొంత కాలం వుండి వుంటే బాగుండేదేమో అనిపిస్తుంది. సరిగ్గా గొల్లపూడిగారి మరణం నాకలాగే అనిపించింది. ఇక్కడ నాన్నగారు శ్రీ గొల్లపూడి మారుతీరావు గారి షష్ఠి పూర్తి ప్రత్యేక సంచికలో వెలిబుచ్చిన అభిప్రాయాన్ని ఇక్కడ మీతో పంచుకుంటున్నాను. వారిద్దరూ, ముళ్ళపూడి వెంకటరమణగారు ముగ్గురు కొంతకాలం ఓ పత్రికలో కలిసి పనిచేశారు.*





## కళా సాంస్కృతిక సంపన్నుడు

గొల్లపూడి మారుతిరావు షష్ట్యబ్దుత్సవం జరుగుతున్నదంటే మహదానందం చెందాను. ఆకాశం ఎంత ఎత్తుగా ఉంటుందనో భూమి సమతలంగా ఉండదనో, సముద్రం ఉవ్వెత్తున అలలతో గంభీరంగా ఉంటుందనో, ఒకచోట కూచుని, చెప్పినట్టు; గొల్లపూడి మారుతిరావుని గురించి నాటక రచయితనా, ఉపన్యాస శిరోమణి అనా, సినిమా నాటక నటుడనా, బుల్లితెర వ్యాఖ్యాత అనా; ఏఁవని చెప్పాలో నా ఊహకు అందడం లేదు.


ఆయన సహృదయుడు, గలగలా మాట్లాడుతూ, స్నేహవాత్సల్యములతో గిలిగింతలు పెట్టగల సమర్థుడు. అందుకే ఆయన అనేక రకాలవారిని ఆకట్టుకోగలిగాడు. ఆయన వాగ్వాణి ఆకాశవాణిగా సర్వవ్యాపితమైంది. ఆయన కలంబాణి సాహితీ ప్రపంచంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సముపార్జించింది. ఆయన సినిమా నాటకరంగాల పాత్రపోషణ ఎప్పుడూ అపాత్రం కాలేదు.

ఒకసారి ఆయన కట్టా సుబ్బారావు దర్శకత్వాన నిర్మిస్తూన్న "కాలరుద్రుడు" చిత్రంలో నటిస్తూ, యింతటి నికృష్ట స్వభావం కలిగి, నిగూఢ క్రూరత్వం నిండిన పాత్రను నేను చూడనూలేదు. నటించనూ లేదు. అలాటి పాత్రను నాచే నటింపచేస్తున్నారు. అలాటి విలక్షణ విలన్ పాత్రను నటిస్తున్నాను. అంటే చెప్పేదు ఆరడుగుల నిడివీ, మూడు అడుగుల వెడల్పూ, నాలుగడుగుల లోతు గల 'గోతిని' తీసి, ఆయన్ను పడుకోబెట్టి, పైన మట్టిని పోసే దృశ్యాన్ని తీసినప్పటికినీ కిమ్మనలేదు సరికదా, సహజత్వానికి దగ్గరగా ఉండేట్టు నటించారు. పాత్ర సహజత్వం కోసం ఆయన పడే శ్రమ ఇంతా అంతా కాదని, స్వయంగా చూచి గ్రహించాను.

ఆయనకు పెద్ద 'ఎస్సెట్' ఆయన భార్య. ఆమె ఆయనకు అన్నివిధాలా తలలోని నాలుకలా ఉంటుంది. ఆయన తన సంతతిని ఏ కట్టుబాట్లకూ బందీకృతులను కావించలేదు. మూడో కుమారుడు శ్రీనివాస్‌ని అతని అభీష్టం ప్రకారం సినిమా రంగ దర్శకత్వ శాఖలోనే ప్రవేశపెట్టారు. ఒక పెద్ద దర్శకుడు కావల్సిన అతడు మొదటి చిత్రం పూర్తిగాకుండానే జలప్రమాదానికి మరణించగా సజలనయనుడైన మారుతిరావు, అతనిపేరిట, తన కుటుంబీకుల పరంగా ఒక ట్రస్టును నెలకొల్పి, గొల్లపూడి శ్రీనివాస్ స్మృతిపరంగా, ఏటేటా ఒక నవయువ–తొలిచిత్ర–దర్శకుణ్ణి, భాషాభేదం లేకుండా 'ఒక లక్ష రూపాయలు' రొఖ్ఖం బహుమానం యిచ్చి, సన్మానిస్తున్నారంటే మారుతిరావు హృదయం ఎంత ఉన్నతమైనదో విశదం గాకపోదు. కళపట్ల, కళాకారులపట్ల ఆయను గల గౌరవ, వాత్సల్యములేమిటో – ఈ విషయంగానే విదితమవుతున్నది.

ఆంగిక, వాచిక, అభినయాల్లో ఆయన చూపించే నైపుణ్యం, మానవతా విలువలకు ఆయనిచ్చే గౌరవమూ, నిరంతరం. ఆయన మోముపై కనిపించే నవ్వూ; మారుతీరావు ట్రేడు మార్కులు. వీటికెప్పుడూ 'క్వొశ్చెన్ మార్కు' ఉండదు. **– గోటేటి శ్రీరామారావు**

# నా షష్ట్యబ్ద పూర్తి ఆనందానుభూతి



మనది ఎంతో పవిత్రమైన, ఆదర్శవంతమైన, సత్సంప్రదాయమైన సంస్కృతి మన పెద్దలు మనకు కొన్ని ఆచారములను కొన్ని సంస్కారములను తప్పకుండా చెయ్యమని చెప్పారు. అట్టి సంస్కారాలలో ఈ షష్టి పూర్తి మహోత్సవం ఒకటి. నాన్నగారు నాకీ షష్టిపూర్తి ఉత్సవాన్ని ఘనంగా చెయ్యాలని ఇంటిల్లపాదికి చెప్పేవారు. వాడు (నేను) మీ అందరికి అన్నీ దగ్గరుండి చేసాడురా అది మీ బాధ్యత అనేవారు. కాని ఆయన మరణం ఆతరువాత సంవత్సరం చేసుకోవలసిన షష్ఠి పూర్తిని ఆయన సంవత్సరికాల తర్వాత అంటే డిసెంబర్ 9, 10, 11 తేదీలలో ఆయన సంవత్సరికాలు అయ్యాక, డిసెంబర్ 16, 17లలో ఆరుద్ర నక్షత్రం రోజున నా షష్ఠిపూర్తిని తమ్ముళ్ళు, మా పిల్లలు (అమ్మాయి, అల్లుడు, చిన్నమ్మాయి) నిర్ణయించి చకచకా నాలుగు రోజులలో అన్ని పనులు చక్కదిద్దేసారు. అన్నీ బాగా జరిగినా నాన్న వుండి వుంటే ఇంకొంచెం బాగుండేదేమోననిపించింది. ఆయన చూడాలని పదే పదే చెపుతూ వుండేవారు. (అంటే ఆయన సమక్షంలో జరగాలని ఆయన ఆకాంక్ష) పిలుపులు పిలిచే సమయము లేదు. కొందరి బంధువులను చెన్నైలోని మిత్రులను మాత్రమే ఆహ్వానించాం.

కాని నిజంగా కన్నులపండువగా ఒక అందాల అద్భుతంలా జరిగింది. అప్పుడనిపించిది అది ఆ పెద్దాయన (గోటేటి శ్రీరామారావుగారి) ఆశీర్వచనా బలమని. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన మనసంతా అక్కడే వుండి ఆ కార్యక్రమం జరిపించారని అనిపించింది. మనిషి పూర్ణాయువు 120 సంవత్సరములు అందులో సగం 60. కాబట్టి 60 ఏళ్ళు నిండాయంటే ఆ వ్యక్తి జీవితంలో ముఖ్యమైన భాగం పూర్తయినట్లే. అరువది సంవత్సరముల ఆయువు పూర్తయ్యి మరల అరవై సంవత్సరములు ఆయువునిమ్మని భగవంతుడికి కోరే ఉత్సవం. ఈ షష్ట్యబ్ది ఉత్సవం. అమృతోత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవం అరవై సంవత్సరములు పూర్తయిన తల్లితండ్రులకు వారి సంతానము చేసే ఉత్సవం. ఇది మిక్కిలి ఉత్తమమైన సత్కర్మ. ఈ కార్యక్రమంలో తల్లితండ్రులు పొందే ఆనందానుభూతిని వర్ణించలేము. ఇది గుణవంతులైన సంతానమునకు లభిస్తుంది. మా అన్నదమ్ములం నాన్న అమ్మలకు ఈ సత్కార్యాన్ని చేసి ఆనందించాం. అలాగే నా పిల్లలు, నా పిల్లలే అనదగిన తమ్ముళ్ళు కలిసి చేసారీ షష్ఠిపూర్తి. విశ్వకుటుంబ వ్యవస్థలో భారతీయ కుటుంబ వ్యవస్థ అగ్రగణ్యం. ఈ వ్యవస్థ జరుపుకునే ప్రతీ వేడుక ఒక సంబరమే. అందులో ముఖ్యమైనది షష్ఠిపూర్తి 60వ జన్మదిన వజ్రోత్సవాలు, దంపతుల వివాహ స్వర్ణోత్సవాలు ఈ రెండింటి సంయుక్త క్రియ. మానవుడు కుటుంబ జీవి. కుటుంబ మంటేనే సోదర, సోదరి, బంధుమిత్ర, పౌత్ర, ప్రపౌత్రులతో వర్ధిల్లడం. ఇందరి సమక్షములో తన ఇల్లాలినీ వధువుగా నిలిపి వరుడు పునరంకితం కావటం. ఆనాడు వధువు వరునకు సంత్‌సంతానాన్ని ఇస్తే, నేడు వరుడు వధువుతో "నేను, నువ్వు కలిసి ఇంతటి కుటుంబ వ్యవస్థను ఏర్పరచామని తెలపటమే ఈ షష్ఠిపూర్తి లోని సందేశం. మా నాన్న పెళ్ళి, మా అన్నయ్య పెళ్ళి, మా తాతయ్య పెళ్ళి అంటూ చిరంజీవులు కలిసి చేసే ఆనందహేల.

అటువంటి ఈ వేడుకను నవంబరు 16, 17 తారీఖులలో ప్రత్యేకంగా జరపాలని పాలకొల్లులోని మా అన్నయ్య పరిచయం చేసిన శ్రీగిరిధర శాస్త్రి గారి ఆధ్వర్యంలో ఈ షష్ట్యబ్ధి ఉత్సవం కడు రమ్యంగా జరిగింది.

16వ తారీఖు శనివారం నాలుగు గంటలకు నేను, మా లలిత పీటలమీద కూర్చుని ఆ తంతు రాత్రి 9 గంటల వరకునూ, మరునాడు ఉదయం 5 గంటల నుండి 12 గంటల వరకూ ప్రతి ప్రక్రియను శ్రద్ధతో, భక్తితో, త్రికరణశుద్ధిగా చేశాం. మేమిద్దరం వేదికపైనా ఆ రెండురోజులు వున్నందున తమ్ముళ్ళు నారాయణరావు, సాయిప్రసాద్, అమ్మాయి దివ్య అల్లుడు దినేష్, చిన్నమ్మాయి శ్రేయ, తమ్ముడి కొడుకు అక్షయ్, మనవరాలు ఆద్య వీరు అందరిని స్వాగతించటం, మర్యాదపూర్వకంగా పలకరించటం, చకచకా పనులు చెయ్యటం, వెలితి లేకుండా చాలా శ్రద్ధ తీసుకున్నారు.

ముందుగా విఘ్నేశ్వర ప్రార్థన, కలశస్థాపన. పెద్ద కలశాలలో దేవుడిని ఆవాహనం చేసి, తెలుగు సంవత్సరములు 60 పూర్తయ్యినందున అరవై కలశాలలో అరవై సంవత్సరాలను ఆవాహనం చెయ్యటం, ఆయుష్య హోమం, నవగ్రహ హోమం, నక్షత్రహోమం, ధన్వంతరి హోమం, మృత్యుంజయ హోమం, మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, మంగళ స్నానం లాంటి విధులన్ని జరిపించారు. అన్ని వైదికపరంగా, మంత్రపరంగా, సాంప్రదాయబద్ధంగా అన్నిటికన్నా ముఖ్యంగా దైవానుగ్రహంతో చక్కగా జరిగాయి.

ప్రతి పనిని మా పిల్లతో పాటు, తమ్ముళ్ళిద్దరు నారాయణరావు, సాయిప్రసాద్ దగ్గిరుండి చక్కగా చేయించారు. ఏ ఉత్సవానికైనా ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు లేకపోతే కళ వుండదు. పిలిచినవారందరూ ఎంతో ఆత్మీయతతో, ప్రేమతో వచ్చారు. రెండు రోజులు వీక్షించారు. వారి అభిమానాన్ని ఆశీస్సును మెండుగా అందించారు. నాన్న బాటలోనే పయనిస్తూ ఆధ్యాత్మికంగా ఆయన చూపిన దారిలోనే నడుస్తున్నందువల్ల తిరుపతి నుండి మిత్రులు శ్రీ గోపినాథ్ దీక్షితులు ప్రత్యేకంగా వారి కుటుంబంతో వచ్చి స్వామివారి ప్రసాదాన్ని అందించి, మనసారా దీవించడం, చెన్నై మైలాపూరు సాయిబాబా కోవెల నుండి ట్రస్టీలు పురోహిత బృందంతో వచ్చి పూలవాన కురిపించి, బాబావారి నిలువెత్తు మాలలు వస్త్రాలతో ఆశీర్వదించడం, మైలాపూర్ మయూరవల్లి తల్లి ప్రసాదాన్ని శ్రీరంగరాజ భట్టర్ స్వామి తీసుకురావటం ఇవన్నీ నాన్న పైనుండి అందించిన కానుకలు. అంతేకాదు, గంగాతీర్థం, గోదావరి తీర్థం, కృష్ణా తీర్థం, కావేరి తీర్థం, బ్రహ్మపుత్ర తీర్థం. ఆ నది జలాలన్నిటినితో నా మంగళస్నానం, ఇవన్నీ ఇప్పుడు తలుచుకున్న అది అద్భుతమైన కలగా కళ్ళల్లో మెదులుతూనే వుంది. ముఖ్యంగా మండపంనందు మా రెండేళ్ళ మనవరాలు ఆద్య చేసిన సందడే సందడి. నాన్ననుండి నేర్చుకున్న, స్వతహాగా నాకు సాంప్రదాయం పట్ల వున్న అవగాహన గౌరవాలు వల్ల నేను నా షష్ఠిపూర్తి ఎలా జరిగితే బాగుంటుందనుకున్నానో అలాగే జరిగింది.

ఇక ఆతరువాత నా బాల్యమిత్రులు దంపతిసమేతంగా, తెలుగు బ్రాహ్మణ మహాసభ కార్యవర్గం, మా బి.ఎన్.ఐ. మిత్రులు, మా తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్ మిత్రులు, ఇంటి చుట్టుపక్కల వారితో పాటు నాన్నగారి స్నేహితులయిన అజంతా శంకరరావుగారు, గోపురం హరికృష్ణ గారు, ఫిలిం చాంబర్ అధ్యక్షులు కాట్రగడ్డ ప్రసాదుగారు, ఆస్కా ఎరుకలయ్య గారు కూడా వచ్చి ఆశీర్వదించారు. మా పాలకొల్లు అన్నయ్య వదిన పిల్లలను, అల్లుడిని, మేనకోడలు దంపతి సమేతముగా రావడం నాకు మహదానందం కలిగించింది.

ఎప్పుడూ సంవత్సరంలో రెండుమూడు మార్లన్నా ఆ తిరుమల వేంకటేశ్వరుడు దర్శనం చేసుకుంటాం. గతేడాది పూర్తిగా వెళ్ళనందువల్ల షష్ఠిపూర్తి వెనువెంటనే మొత్తం కుటుంబ సభ్యులందరూ ఆ వెంకన్న దర్శనానికి వెళ్ళాము. ఆయన చక్కగా కొత్త పెళ్ళికొడుకులా నన్ను భావించి జరగండి, తొయ్యండి అననీయకుండా తాపీగా దర్శనం యిచ్చి చక్కగా సాగనంపారు. పేరు వేంకటేశ్వరరావు కదా వేంకటేశ్వరుడు దర్శనం అయ్యాక ఆ కాళహస్తీశ్వరుడిని దర్శించుకుని తిన్నగా మా ఆశ్రమం, ఇదేవిటి మీకు ఆశ్రమం వుందా అంటారా, అవును శుకబ్రహ్మాశ్రమం. మా కుటుంబానికీ ఆ ఆశ్రమానికి ఎనలేని అనుబంధం వుంది. ఎప్పుడు తిరుమల వెళ్ళినా, తిరుగు ప్రయాణంలో అక్కడకెళ్ళి స్వామి విద్యాస్వరూపానంద స్వామివారిని దర్శించి శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామివారి మండపంలో కాసేపు ధ్యానం చేసి రావడం పరిపాటి. ఈసారి నాన్న లేకుండా వెళ్ళడం కాస్త బాధనిపించినా స్వామివారు మాపట్ల చూపిన ప్రేమానురాగాలు నేను సరిగ్గా కాగితంపై పెట్టలేకపోతున్నా, మేము వెళ్ళినది సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట. తిన్నగా స్వామి మమ్మల్ని భోజనశాలకు తీసుకెళ్ళి మాకా అన్నప్రసాదాన్ని వినియోగం చేసేరు. అక్కడే వుండి పర్యవేక్షించారు. ఒక తండ్రిలా ప్రక్కనుండి ఏవిటి ఇంకో నాలుగు మెతుకులు తినండి అంటూ ప్రేమగా చెప్పడం నాన్న ప్రక్కనున్నట్టే అనిపించింది. ఈసారి మరో బోనస్ కూడా అది మా గురువుగారి షష్ఠిపూర్తి కానుక. ఇదిగో ఈ పుస్తకం తీసుకెళ్ళి ఇది మీ ప్రెస్సులోనే ప్రింటవ్వాలి, ప్రింట్ చేసి పంపు, డబ్బెంతో చెప్పు పంపించేస్తాం అంటూ ఓ పుస్తకాన్ని ఇచ్చారు. అది నేనూహించని పరిణామం.

ఇలా ఇలా నేను తలుచుకుని తలుచుకుని ఇంకా ఇప్పుడు తలుచుకుంటూంటే వున్న ఆనందానుభూతి నా షష్ఠిపూర్తి. ●